


# శివసూర్య


SHIVA SURYA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

RNI APTEL : 2023/88704








కర్నూలు సంపుటి : 03, సంచిక : 276 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/ సోమవారం -15 - జూన్ - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,


## జూలై 9న అయతోల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు!

- ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీకి సంబంధించిన ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించే అంత్యక్రియల పూర్తి షెడ్యూల్‌ను ఇరాన్ అధికారులు ప్రకటించారు.
- అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడుల్లో ఖమేనీ మరణించినట్లు పేర్కొంటూ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఆయన అంత్యక్రియలు ఐదు రోజులపాటు వివిధ నగరాల్లో నిర్వహించనున్నారు.



మిగతా 2లో

## యుద్ధాన్ని ముగించేందుకు సమయం ఆసన్నమైంది మిత్రమా!

- ఇరాన్‌తో ఒప్పందం కొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశం
- నెతన్యాహుకు ట్రంప్ ఫోన్‌లో స్పష్టమైన సందేశం
- 60 రోజుల కాల్పుల విరమణకు ప్రతిపాదనలు



ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. మిగతా 2లో

### తిరుపతి సభ విజయోత్సవం కాదు..

## వెన్నుపోటు ఉత్సవం



- 'క్యాష్--రాజేష్--లోకేష్' ఫార్ములాతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారు
- తిరుపతి సభ రెండేళ్ల విజయోత్సవ సభ కాదు.. ఆరు కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ.
- సూపర్ సిక్స్ అని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు సూపర్ సైలెంట్ అయ్యారు.
- మేనిఫెస్టోను జేబులో పెట్టి.. ఎర్రబుక్‌ను అరచేతిలో పెట్టుకున్నారు.

తిరుపతిలో ఈ నెల 12న కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెండేళ్ల విజయోత్సవ సభ వాస్తవానికి విజయాలను చెప్పుకునే సభ కాదని, ఆరు కోట్ల మంది రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన సభ అని వైయస్ఆర్‌సీపీ

మిగతా 2లో

### వికసిత్ భారత్ నిర్మాణమే

# మన లక్ష్యం

- నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది
- సుసంపన్న భవిష్యత్ కోసం మానవ వనరులపై పెట్టుబడి పెట్టాలి
- స్పీడ్, బ్రాండ్ సీబీఎన్, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఏపీ ప్రత్యేకతలు
- విశాఖలో డీజీ 100ఎక్స్ ఏపీ సదస్సులో మంత్రి నారా లోకేష్
- వికసిత్ భారత్ నిర్మాణమే మన లక్ష్యం. నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది. సుసంపన్న భవిష్యత్ కోసం మానవ వనరులపై పెట్టుబడి పెట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.
- రాష్ట్రంలో ఉన్నత విద్య, డిజిటల్ పరివర్తన, ఆధునిక సాంకేతికత అంశాలపై విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్ట్ లో జరిగిన 'డీజీ 100ఎక్స్ ఏపీ' సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
- మన దేశంలో విద్య, ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న అత్యుత్తమ మేధావుల మధ్య విశాఖపట్నంలో ఉండటం ఆనందంగా ఉంది.

**ట్రిపుల్ ఐటీ ప్రవేశాల ఫలితాలు విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్..**

**ఆర్జీయూకేటీ ఆరేళ్ల బీటెక్ కోర్సు ప్రవేశాల ఫలితాలు విడుదల**

**ఎంపికైన విద్యార్థులు rgukt.in వెబ్‌సైట్ నుంచి లేఖలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు**



విశాఖపట్నం: వికసిత్ భారత్ నిర్మాణమే మన లక్ష్యం. నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది. సుసంపన్న భవిష్యత్ కోసం మానవ వనరులపై పెట్టుబడి పెట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య, డిజిటల్ పరివర్తన, ఆధునిక సాంకేతికత అంశాలపై విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్ట్ లో జరిగిన 'డీజీ 100ఎక్స్ ఏపీ' సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మిగతా 2లో

### అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..

## హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సత్యకుమార్

ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య

ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడి



ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇదే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించారని గుర్తుచేశారు. గత రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి వివరాలను,

మిగతా 2లో

### ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొనేలా సన్నద్ధమవ్వండి



- ఏఐపై పట్టుసాధించండి
- సైబర్ నేరాలను అరికట్టండి
- మాదకద్రవ్యాల పీచమణచండి
- నీతి ఆయోగ్ భేటీలో రాష్ట్రాలకు ప్రధాని దిశానిర్దేశం

న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ 11వ పాలకవర్గ సమాశంలో రాష్ట్రాలకు దేశం ఎదుర్కొంటున్న పలు సవాళ్లు, రాబోయే సువర్ణావకాశాలపై ప్రధాని మోదీ మిగతా 2లో

## హామీలన్నీ ఉల్లంఘించి ప్రజలను, యువతను, రైతులను జగన్ మోసం చేశారు.

**వెన్నుపోటు, గొడ్డలివేటుకు జగన్ బ్రాండ్ అంబాసిడర్**

- కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని వెల్లడి
- జగన్ రెడ్డి కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- డీఎస్సీ, పోలీసు ఉద్యోగాలతో పాటు అనేక హామీలను ఇప్పటికే అమలు చేశామని స్పష్టం



ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిన జగన్ ను మించిన వెన్నుపోటుదారుడు మరొకరు లేరని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "వెన్నుపోటుకు, గొడ్డలివేటుకు జగన్ రెడ్డి మిగతా 2లో

### విద్యాశాఖను చెడగొట్టాలని

## లోకేశ్‌కు ఆ శాఖ అప్పగించారా ?

**లోకేశ్‌కు అందుకే ఆ శాఖ అప్పగించారా?**

- ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు
- రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు.
- రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఉందా కూటమి ప్రభుత్వ వెన్నుపోట్లపై పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాం.



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శనివారం బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నిత్యావసర సరుకుల మిగతా 2లో

### కూటమి ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు



- సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్ అయిందన్న షర్మిల
- అప్పులు చేయడంలో ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని ఎద్దేవా
- పాలన అంతా మాయాబజార్ లా కనిపిస్తోందని విమర్శ

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో... ఏపీ కాంగ్రెస్ చీఫ్ మిగతా 2లో

### రెండేళ్ల నారాసుర పాలన..

## రాష్ట్రానికి, ప్రజలకు వెన్నుపోటు

- చంద్రబాబూ.. ఈ హామీలన్నీ ఏమయ్యాయని ప్రజలు అడుగుతున్నారు
- రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ప్రతి కుటుంబాన్నీ మోసం చేశారు
- చెప్పిన మాటలకు.. చేసిన పనులకు ఏమాత్రం పొంతనే లేదు
- ప్రతి క్షణం మోసం, దగా, స్కామ్‌ల మయం.. డీఎస్సీలోనూ అక్రమాలు
- రెండేళ్లుగా పచ్చి అబద్ధాల ప్రచారం, మోసం, కక్ష సాధింపులు, వివక్ష, అరాచకాలు, రెడ్‌బుక్ పాలన
- కుప్పకూలిన వ్యవస్థలు.. ఎవరికీ రక్షణ లేదు.. జంగిల్ రాజ్‌లా రాష్ట్రాన్ని నడుపుతున్నారు
- అమరావతి నిర్మాణం పేరుతో అంతులేని అవినీతి.. అన్నింటా మాఫియాతో దోపిడీ
- ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి.. పేదరికం బుసలు కొడుతోంది

**రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌గా మార్చారు**

**చెప్పిన మాటలకు.. చేసిన పనులకు ఏమాత్రం పొంతనే లేదు**

**సూపర్ సిక్స్.. సూపర్ సెవెన్ సహా 143 హామీలిచ్చారు**



ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ 143 హామీలు ఇచ్చిన చంద్రబాబునాయుడు ఈ రెండేళ్లలో వాటిని అమలు చేయకుండా అటు రాష్ట్రానికి, ఇటు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండి పడ్డారు. రెండేళ్ల నారాసుర పాలన రాష్ట్రానికి, ప్రజలకు వెన్నుపోటు పొడిచిందన్నారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ఇంటింటికీ బాండ్లు రాసిచ్చి మరీ మిగతా 2లో

### ఏపీ లిక్కర్ స్కామ్‌లో అంతిమ లబ్ధిదారుడు జగనే



- మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
- మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు.

మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో మిగతా 2లో

# నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లతో మోసపోవద్దు.

భారీ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్ల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

ఆన్‌లైన్ కొనుగోళ్ల సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి.

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గ



కర్నూలు,శివసూర్య, జూన్ 14:ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి ప్రజలను మోసం చేసే సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.కొంతమంది సైబర్ నేరగాళ్లు ప్రముఖ కంపెనీల పేర్లను పోలి ఉండే నకిలీ వెబ్‌సైట్లను రూపొందించి, భారీ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్లు, తక్కువ ధరలకు స్కూల్ యూనిఫాంలు, షూస్, ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, గృహోపకరణాలు అందిస్తున్నట్లు ప్రచారం చేస్తూ ప్రజలను ఆకర్షిస్తున్నారు.ఈ వెబ్‌సైట్ల ద్వారా ముందస్తు చెల్లింపులు తీసుకుని, అనంతరం వస్తువులు పంపకుండా లేదా నాసిరకం వస్తువులను పంపించి మోసాలకు పాల్పడుతున్నారు.ఈ నేపథ్యంలో ప్రజలు ఆన్‌లైన్ కొనుగోళ్ల సమయంలో ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ గారు సూచించారు.

### ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:

అధికారిక మరియు విశ్వసనీయ వెబ్‌సైట్లలో మాత్రమే కొనుగోళ్లు చేయాలి.వెబ్‌సైట్ ఖ=ూ (వెబ్ చిరునామా) సరైనదేనా అని తప్పనిసరిగా పరిశీలించాలి.మార్కెట్ ధర కంటే అత్యంత తక్కువ ధరలకు వస్తువులు అందిస్తామని చెప్పే ప్రకటనలను నమ్మరాదు.ూూలు, బ్యాంకు ఖాతా వివరాలు, డెబిట్/క్రెడిట్ కార్డు వివరాలను ఎవరితోనూ పంచుకోరాదు.అనుమానాస్పద లింకులు, సందేశాలను క్లిక్ చేయకుండా ఉండాలి.సాధ్యమైనంత వరకు "క్యాష్ ఆన్ డెలివరీ (జూణ)" విధానాన్ని ఉపయోగించాలి.కొనుగోలు చేసే ముందు వెబ్‌సైట్ సమీక్షలు (=వజఅవషం) మరియు రేటింగ్‌లను పరిశీలించాలి.ఆన్‌లైన్ మోసాలకు గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా కేంద్ర ప్రభుత్వ సైబర్ క్రైమ్ పోర్టల్ ష్ష్ష.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని కర్నూలు ఎస్పీ గారు కోరారు.మోసానికి గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే మోసపోయిన మొత్తాన్ని తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.ప్రజల సహకారం, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

## రేపటి నుంచే ఇంటింటికి బీఎల్వోలు

## ఈఆర్వో, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు

## ప్రజలు పత్రాలు, వివరాలు అందించి సహకరించాలి



కర్నూలు, శివసూర్య, జూన్ 14:భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) - 2026 కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సోమవారం నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటికి వచ్చి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం జూన్ 15 నుంచి జూలై 14 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి సంబంధిత బీఎల్వోతో పాటు వారికి సహకరించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు సైతం వస్తారని తెలిపారు. ప్రతి ఓటరుకు రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని, అందులో 2002 సంవత్సరంలో ఓటరు లేదా ఓటరు సంబంధికులు (తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు) ఏ జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం నంబర్, పార్ట్ నంబర్, వరుస నంబర్‌లో నమోదై ఉన్నారో సంబంధిత వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.అలాగే రెండు హాఫ్ సైజు ఫొటోలు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. ఓటరు నుంచి ఫారాలు స్వీకరించిన అనంతరం బీఎల్వో ఒక ఎన్యూమరేషన్ ఫారంపై సంతకం చేసి ఎక్నాలెడ్జ్‌మెంట్‌గా తిరిగి ఓటరుకు అందిస్తారని స్పష్టం చేశారు.కావున నియోజకవర్గంలోని ఓటర్లు 2002లో తమకు లేదా తమ సంబంధికులకు ఎక్కడ ఓటు ఉండేదో సంబంధించిన వివరాలు, ఓటరు, ఓటరు సంబంధికుల ఈపిక్ కార్డులు, రెండు ఫొటోలు ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకరించాలని, బీఎల్వోలు కోరిన పత్రాలు, వివరాలను అందించాలని కోరారు.సరైన సమాచారాన్ని అందించడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు తోడ్పడాలని ఈఆర్వో, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం సంబంధిత బీఎల్వోలు లేదా ఎన్నికల అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

## భారీ వర్షాలకు వగరురు చెరువుకు గండి: ముంపు ముప్పుతో రైతులు ఆందోళన



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 14:ఆదివారం కురిసిన భారీ వర్షాలకు వగరురు గ్రామంలోని పెద్ద చెరువుకు గండి పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతున్న సమయంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో సుమారు 20 అడుగుల మేర కట్టకు గండి పడింది. దీంతో చెరువు నీరు వృథాగా బయటకు పోతోంది. గండి మరింత పెద్దదైతే దిగువన ఉన్న వగరురు, తిమ్మాపురం గ్రామాలతో పాటు వందల ఎకరాల వరి, వేరుశెనగ పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి గండిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చేందుకు ఆయా గ్రామాల రైతులు, యువకులు, కూలీలు కలిసికట్టుగా ముందుకు రావాలని గ్రామ సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. గండి పడిన ప్రాంతాన్ని వీడియో తీసి ఎల్ఎల్సీ డిపార్ట్‌మెంట్, ఇరిగేషన్ అధికారులకు పంపించినట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలైన మాధవరం, రాంపురం ప్రజలకు ఫోన్ల ద్వారా సమాచారం అందించి, ఇసుక బస్తాలు, జేసీబీల సాయంతో గండిని పూడ్చే చర్యలు తక్షణమే చేపట్టాలని గ్రామ ప్రజలకు, రైతు సంఘాలకు వారు మనవి చేశారు. అధికారులు స్పందించి తక్షణ సహాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

## మాధవరం ఘర్షణ: 'మొదట దాడి టీడీపీదే' అని సీసీ కెమెరా సాక్ష్యం చూపాలన్న వైసీపీ



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 14: మాధవరం గ్రామంలో శుక్రవారం జరిగిన వైసీపీ-టీడీపీ శ్రేణుల ఘర్షణపై వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి ఆదివారం మంత్రాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి స్పందించారు. కోసిగి మండల కేంద్రంలో 'కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు' అనే నిరసన కార్యక్రమానికి మంత్రాలయం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు ర్యాలీగా వెళ్తుండగా మాధవరం వద్ద టీడీపీ నేతలు కావాలనే గొడవకు దిగారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. మొదట దాడి చేసింది టీడీపీ వారేనని, అందుకు సాక్ష్యంగా అక్కడి వారి ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలించాలని ఆయన సవాల్ విసిరారు. ఎమ్మెల్యే పర్సనల్ గన్‌మెన్ ఇరువర్గాలను వారించి అక్కడి నుంచి పంపించినా, కార్యక్రమం ముగించుకుని తిరిగి వచ్చే సమయంలో టీడీపీ నేతలు కాపుకాచి తమ కార్యకర్తల రెండు వాహనాలకు నిప్పుపెట్టి, కర్రలతో దాడి చేసి పలువురిని గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయం చేస్తామని గొప్పలు చెప్పే టీడీపీ నేతలు వైసీపీలోని బీసీ, ఎస్సీ కార్యకర్తలనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ రాజకీయ బలం చూపించుకునేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, అయితే కార్యకర్తలపై దాడులు కొనసాగితే చర్యకు ప్రతిచర్య కచ్చితంగా ఉంటుందని, పార్టీ ఆదేశాల మేరకు తాము ముందుకు వెళ్తామని ఆయన హెచ్చరించారు. మీ నాన్నకు టిడిపిలో మంచి గౌరవం లేకపోవడంతో ఎమ్మెల్యే టికెట్ రాకుండా తిక్కారెడ్డి అడ్డుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. అక్కడ గౌరవం లేకపోవడంతోనే వైసీపీ పార్టీలో అదే మా చిన్నాన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేర్పించి జిల్లా స్థాయి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి పించామని చెప్పారు. అక్కడ కూడా రైతుల దగ్గర లోన్లు ఇవ్వడానికి కమిషన్లు తినే అక్రమ సంపాదనతో మీరు ఆస్తులు పోగేసి ఉన్నారని ఆరోపించారు.

# మంత్రాలయంలో ట్రాఫిక్ జామ్



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 14: ఆదివారం మంత్రాలయం పట్టణం భారీ ట్రాఫిక్ జామ్‌తో స్తంభించిపోయింది. వారాంతపు సెలవు దినం కావడంతో శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనానికి రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఉదయం 9 గంటల నుంచే రాఘవేంద్ర కూడలి నుంచి శ్రీ మఠం ఆసుపత్రి, బస్టాండ్ మీదుగా ప్రధాన రహదారిపై వాహనాలు బారులు తీరాయి. వాహనాలు కిలోమీటరూ మేర నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ట్రాఫిక్‌లో అగ్నిమాపక వాహనాలు సైతం ఇరుక్కుపోవడంతో అత్యవసర సేవలకు తీవ్ర ఆటంకం కలిగింది. ప్రతి ఆదివారం గురువారం మరియు సెలవు దినాలలో ఇదే పరిస్థితి పునరావృతం అవుతుందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ప్రతిపాదిత బైపాస్ రోడ్డు పనులను ప్రభుత్వం వెంటనే వేగవంతం చేయాలని స్థానికులు, వ్యాపారస్తులు, భక్తులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## అర్ధరాత్రి వర్షానికి తడిసిన భక్తులకు శ్రీ మఠం చేయూత: ఆశ్రయం కల్పించిన అధికారులు



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 14:శనివారం అర్ధరాత్రి కురిసిన కుండపోత వర్షానికి శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం సెలవు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు మంత్రాలయానికి తరలివచ్చారు. అయితే అర్ధరాత్రి ఒక్కసారిగా వర్షం ప్రారంభం కావడంతో సత్రాల్లో గదులు దొరకని, బస సౌకర్యం లేని భక్తులు మధ్వా కారిడార్ ,రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో, బస్టాండ్‌లో తడిసిపోయారు. చిన్న పిల్లలు, వృద్ధులు వర్షంలో తడవడంతో అల్లాడిపోయారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీ మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో అధికారులు వెంటనే స్పందించి మానవత్వం చాటుకున్నారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో మఠం పరిసరాల్లోని హెచ్ ఆర్ వి మంటపం, అన్నదాన సత్రం హాళ్లు, భక్తుల విశ్రాంతి షెడ్లను తెరిపించి వందలాది మంది భక్తులకు ఆశ్రయం కల్పించారు. తడిసిన భక్తులకు తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వేళ తమను ఆదుకుని దైవ సేవ చేసిన శ్రీ మఠం అధికారులను, సిబ్బందిని భక్తులు మనస్ఫూర్తిగా కొనియాడారు.

## మంత్రాలయం నియోజకవర్గంలో కుండపోత వర్షం: కోసిగిలో 100.6 మి.మీ



మంత్రాలయం, శివసూర్య(ప్రతినిధి)జూన్ 14:శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు అదోని డివిజన్ పరిధిలో విస్తారంగా వర్షాలు కురిశాయి. డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్, అదోని తెలిపిన వివరాల ప్రకారం 14.06.2026న మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి మండలంలో అత్యధికంగా 100.6 మి.మీ వర్షపాతం నమోదైంది. పెద్దకడబూరు మండలంలో 70.4 మి.మీ, మంత్రాలయం మండలంలో 50.2 మి.మీ, కౌతాళం మండలంలో 36.0 మి.మీ వర్షం కురిసింది. నియోజకవర్గంలోని ఈ నాలుగు మండలాల్లోనే మొత్తం 257.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మంత్రాలయం పట్టణంలో తెల్లవారుజాము నుంచి కుండపోత వర్షం ఏకధాటిగా కురవడంతో రాఘవేంద్రపురం, రామచంద్రనగర్ ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సెలవు దినం కావడంతో శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కుండపోత వర్షం కారణంగా భక్తులు కాస్త ఇబ్బందులు పడినప్పటికీ, గొడుగులు పట్టుకుని, రెయిన్ కోట్లు ధరించి స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. వర్షాన్ని లెక్కచేయకుండా భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఇదే సమయంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన ఈ తొలకరి వర్షం రైతన్నలకు ఎంతో మేలు చేసింది. భూములు చిత్తడిగా మారడంతో దుక్కులు దున్నుకోవడానికి, విత్తనాలు విత్తుకోవడానికి, ఎరువులు చల్లుకోవడానికి ఈ వర్షం ఎంతగానో అనుకూలంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరి, వేరుశనగ, పత్తి పంటలు వేసుకునే రైతులు ఈ వర్షంతో వ్యవసాయ పనులు ముమ్మరం చేయనున్నారు. చెరువులు, కుంటలు జలకళ సంతరించుకోవడంతో సకాలంలో వర్షం కురవడంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

## తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే: వగరూరు రిజర్వాయర్ గండికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు



మంత్రాలయ ం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 14:మంత్రాలయం మండలం వగరూరు రిజర్వాయర్‌కు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో రిజర్వాయర్ కట్టకు రెండు మూడు చోట్ల గండి పడింది. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా, గ్రామస్తులు నేరుగా ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరులు వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జ్ సి.వి. విశ్వనాథ్ రెడ్డిని సంఘటనా స్థలానికి పంపి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గండి పూడ్చివేతకు అవసరమైన జేసీబీలు, ట్రాక్టర్లను వెంటనే ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సి.వి. విశ్వనాథ్ రెడ్డిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎల్ఎల్సీ అధికారులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, రాంపురం రెడ్డి సోదరుల అభిమానులు పాల్గొన్నారు. తక్షణమే స్పందించి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యేకు, రాంపురం రెడ్డి సోదరులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## అమావాస్య సందర్భంగా శ్రీ గుంటిరంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు

ఐజ, శివసూర్య జూన్ 14 : జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ ఆరవ వార్డు తుపత్రాల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి అధిక జ్యేష్ఠ మాసం మాస శివరాత్రి బహుళ త్రయోదశి సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి పట్టణ మరియు గ్రామప్రజలందరూ భక్తిశ్రద్ధలతో కేశవ నామాలతో రామానుజాచార్యఅష్టోత్తర శతనామావళి స్మరించుకొని భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి యొక్క గోవిందం భజగోవిందం హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామావళి అష్టోత్తరాలు పల్లకి సేవతో ఊరేగింపుగా భక్తాదులందరూ భక్తి ప్రపత్తులతో కార్యక్రమాలు నిర్వహించి భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకోవడం జరిగింది. అనంతరం స్వామివారికి కాయ కర్పూరాలు తీర్థప్రసాదాలను సమర్పించుకొని మొక్కులను చెల్లించుకుని అనంతరం ఆలయ అర్చకులు ఆచార్య శ్రీ వైష్ణవం చక్రవర్తి చార్యులు భక్తాదులందరికీ ఆశీర్వచనాలు మంగళా శాసనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు రమేష్ కౌన్సిలర్ మహేశ్వరివెంకన్నగౌడ్ రఘు శంకర్ ఆంజనేయులు వీరేష్ పాండు అమర్ సరస్వతి చిన్నఆంజనేయులు గ్రామ ప్రజలు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## విష్ణు సహస్రనామ పారాయణం చాలీసా డీ.డీ.ఎన్.ఏస్. వికాసతరంగిణి ఆధ్వర్యంలో

జోగులాంబ, శివసూర్య జూన్ 14 గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ భరత్‌నగర్ కాలనీలో వికాస తరంగిణి సభ్యులు జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యుల స్వగృహంలో వికాస తరంగిణి, అర్చక సంఘం మరియు హెల్పింగ్ హాండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, ఆంజనేయ స్వామి దండకం పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీమహావిష్ణువు మరియు ఆంజనేయ స్వామి వారి నామస్మరణలో మునిగిపోయారు. ప్రతిరోజూ చక్రవర్తి చార్యుల స్వగృహంతో పాటు శ్రీలేఖ కిరాణం ప్రాంగణంలో కూడా ఆంజనేయ స్వామి దండకం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించబడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా మరియు ఆంజనేయ స్వామి దండకం పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం, ధైర్యం మరియు దైవానుగ్రహం లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులు నిత్యం భగవన్నామ స్మరణ చేయాలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని జీవితాన్ని ధన్యంగా మార్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, అర్చక సంఘం ప్రతినిధులు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## మంత్రాలయంలో భక్తుల రద్దీ: మాంచాలమ్మ, రాఘవేంద్ర స్వామి దర్శనాలకు పోటెత్తిన భక్తులు



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 14:ఆదివారం సెలవు దినం కావడంతో మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి శ్రీ మాంచాలమ్మ అమ్మవారిని, శ్రీ రాఘవేంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా మఠం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, తాగునీరు, అన్నదానం సౌకర్యాలు కల్పించారు. ఉదయం మూల బృందావనానికి అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి రథోత్సవ సేవలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రహ్లాదుడిని చెక్క రథం,



బంగారు, వెండి, నవరత్న రథోత్సవాల్లో ఉంచి మేళతాళాలతో మఠం వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. భక్తజన సందోహంతో మంత్రాలయం పుణ్యక్షేత్రం కిటకిటలాడింది.

## గంటావూరు కాలనీ అభివృద్ధికి బాధ్యత నాది

అన్ని సౌకర్యాలు కల్పిస్తాంఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



పలమనేరు జూన్ 14( :పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత తనదేనని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కాలనీలో రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం సహా ప్రజలకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.తమ ప్రాంతంలో ఉన్న ఈద్గా ప్రాంగణానికి ప్రహరీ నిర్మాణం మంజూరు చేయాలని కోరుతూ గంటావూరు కాలనీకి చెందిన మైనారిటీ సోదరులు టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడిన ఎమ్మెల్యే, కాలనీలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.భవిష్యత్తులో ఈ సౌకర్యాలు కావాలని మళ్లీ అడిగే అవసరం లేకుండా గంటావూరు కాలనీని అభివృద్ధి చేయాలన్నదే నా లక్ష్యం. ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక వసతిని అందుబాటులోకి తీసుకువచ్చి ఓ మంచి ప్రాంతంగా తీర్చిదిద్దుతాం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మైనారిటీ సోదరులు చేసిన ఈద్గా ప్రహరీ నిర్మాణ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలిస్తామని, మతపరమైన ప్రదేశాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే హామీపై కాలనీవాసులు, మైనారిటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజా పీర్, నాయకులు శ్రీధర్, మదన్, బాబాజాన్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం.



చిలకలూరిపేట జూన్ 14. .మడలం లోనొమిటినేనివారిపాలెం గ్రామంలోని వికాస్ ఇండియా కేర్ హోమ్ వృద్ధాశ్రమంలో పట్టణానికి చెందిన మెడికల్ షాప్ నిర్వాహకుడు షేక్ బాషా వారి తల్లి వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మాదాసు భాను ప్రసాద్, ఆర్కిటెక్ట్ జబ్బార్, ఆక్యుపంచర్ తెరపిస్ట్ సాదిక్ పాల్గొని ప్రసంగిస్తూ ఆధునిక సమాజంలో పట్టెడన్నం లేక ఆకలితో చనిపోతున్న సంఘటనలు జరుగుతున్నాయని ఇది ఎంతో దురదృష్టకరమని, ఆకలితో చనిపోవడం సమాజానికి ఎంతమాత్రము సమర్ధనీయం కాదు అని అన్నారు. పౌష్టికాహార లోపంతో చనిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరి పైన ఉంది అని అన్నారు. ఇదే క్రమంలో పండుగలు పెళ్లిళ్ల పేరిట ప్రతిరోజు దేశంలో ఎంతో ఆహారం వృధా అవుతుందని అన్నారు. వృధాను అరికడితే దేశంలో పౌష్టికాహార లోపంతో ఎవరు చనిపోయే పరిస్థితి ఉండదు అని అన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేసిన భాష కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని వృద్ధాశ్రమ నిర్వాహకులు జోజి బాబు తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు మండలంలో నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు త్రిబుల్ ఐటీ కి ఎంపిక





పలమనేరు జూన్ 14 ( ):రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన త్రిబుల్ ఐటీ మెరిట్ జాబితాలో పలమనేరు మండలం నుంచి నలుగురు విద్యారు థులుఎంఎ ి కయ్యారు .మండలం లోని గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దిలీప్ అనే విద్యార్థి ,జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చదువుతున్న ఎం వర్ధిని, ఎం నవ్య అనే విద్యార్థినీలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థి, విద్యార్థినీయులకు పలమనేరు మండలం విద్యాశాఖ అధికారులు పి. లీలారాణి, సి.బాల సుందరం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత,గవర్నమెంట్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు షంషీర్,సి ఆర్ ఎం టి లు ఎస్ హరిబాబు, వి. రంజిత్ కుమార్ ఎం .అనిల్ కుమార్, గీత, కె రెడ్డెమ్మ డేటా ఆపరేటర్ గిరిధర్ అభినందించారు.



## : ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా చక్రవర్తి చార్యులకు ఘన సత్కారం



గద్వాల, శివసూర్య, జూన్ 14: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు తుపత్రాల గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామి





దేవాలయ అర్చకులు, జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు గారిని ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు.ఇప్పటివరకు 42 సార్లు రక్తదానం చేసి సమాజ సేవలో ఆదర్శంగా నిలిచిన చక్రవర్తి చార్యుల సేవలను గుర్తించి పట్టణ ప్రముఖులు, నాయకులు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శివ, ఆంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొని చక్రవర్తి చార్యులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# అమ్మవారి సన్నిధిలో ఆరోగ్య సంబరం

చందోలులో ఘనంగా 'యోగాంధ్ర'

కలెక్టర్ ఆదేశాలతో ఆలయంలో యోగా శిబిరం: పాల్గొన్న వందలాది మంది భక్తులు

ప్రాణాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

యోగా మాస్టర్ ఉప్పు సాంబశివరావు శిక్షణ

ఆరోగ్యమే మహాభాగ్యం: భక్తులకు పౌష్టికాహారం పంపిణీ చేసిన దేవస్థాన కమిటీ

క్రమశిక్షణే యోగాకు పునాది: ఆశా, అంగన్వాడీ కార్యకర్తల ఉత్సాహభరిత భాగస్వామ్యం



బాపట్ల చందోలు, జూన్ 14 ; ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చందోలు శ్రీ భగలాముఖి అమ్మవారి ఆలయ ప్రాంగణం ఆదివారం ఉదయం ఆధ్యాత్మిక పరిమళాలతో పాటు, ఆరోగ్య చైతన్యంతో వెల్లివిరిసింది. బాపట్ల జిల్లా కలెక్టర్ వారి ప్రత్యేక ఆదేశాల మేరకు, దేవస్థానం ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని, యోగా శిబిరంలో మమేకమయ్యారు. యోగా మాస్టర్ ఉప్పు సాంబశివరావు నేతృత్వంలో జరిగిన ఈ శిబిరం, భక్తులకు నూతనోత్తేజాన్ని ఇచ్చింది. ప్రాణాయామం ధ్యాన ప్రక్రియలను ఆయన భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షారోన్ రాణి మాట్లాడుతూ, "నేటి ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిని జయించడానికి యోగాయే ఉత్తమ మార్గం. క్రమం తప్పకుండా ప్రాణాయామం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా, శారీరక, మానసిక దృఢత్వం చేకూరుతుంది" అని విశ్లేషించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ దేవస్థానం తరపున రాగిజావ, అరటిపళ్లు తాగునీటిని ఏర్పాటు చేయడం అభినందనీయం. ఎంఎన్ఓ మహమ్మద్ రఫీ సమన్వయంతో ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కలకోట చక్రధర్ రెడ్డి, మాట్లాడుతూ, భక్తుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా దేవస్థానం ఇటువంటి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. యోగా మాస్టర్ ఉప్పు సాంబశివరావు మాట్లాడుతూ, యోగా కేవలం వ్యాయామం కాదు, అది ఒక జీవన విధానం. అమ్మవారి ఆలయం వంటి పవిత్రమైన ప్రదేశంలో ప్రాణాయామం చేయడం వల్ల మనస్సుకు అద్భుతమైన ప్రశాంతత లభిస్తుంది. ప్రతి ఒక్కరూ దీనిని ఒక బాధ్యతగా భావించి నిత్యం సాధన చేయాలి" అని పిలుపునిచ్చారు. ఆలయ ఈవో జి. నరసింహమూర్తి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలను పాటిస్తూ, ఆలయానికి వచ్చే భక్తులకు భక్తితో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహించాం. భక్తుల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తాం" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం చందోలు గ్రామ ప్రజల్లోనూ, భక్తుల్లోనూ ఆరోగ్య స్పృహను పెంపొందించింది. ఆధ్యాత్మికతను, ఆరోగ్యాన్ని అనుసంధానించేలా జరిగిన ఈ యోగాంధ్ర కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మాజీ మంత్రి రజిని చూపు పొన్నూరు వైపేనా...!?

చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమం ఫెయిల్ అయినట్లేనా..!?

నగరికంటిపై దాడి చేయడంతో రజనీపై సొంత పార్టీ నేతలే విమర్శలు.

మాజీ సీఎం జగన్ "పేట" కీలక నేతలకు హామీ ఇచ్చారా.. !?




చిలకలూరిపేట/జూన్ 14.రాజకీయాల్లో ప్రజల నాడిని బట్టి ఎప్పుడైనా రాజకీయ సమీకరణాల్లో మార్పు... చేర్పులు జరుగుతాయనేది వాస్తవరూపాలకు అద్దం పడతుంది. మాజీ మంత్రి విడదల రజిని రేపల్లె నియోజకవర్గానికి వెళుతున్నారని గత కొద్ది రోజుల క్రితం పలుపత్రికల్లోనూ, సోషల్ మీడియాలోనూ విస్తృతమైన ప్రచారం జరగడంతో తాను చిలకలూరిపేట నుంచి పోటీ చేస్తానని మీడియా సాక్షిగా వెల్లడించారు. దీనికి ముందు రేపల్లె ప్రాంతంలో తన పిఏ, సొంత బంధు వర్గాలతో రేపల్లె నియోజకవర్గం లో పోటీ చేస్తే ఎలా ఉంటుందనే సర్వే చేయించుకున్నారు. అనుకూలత లేకపోవడంతో చిలకలూరిపేట నుంచే కార్యక్రమాలు ప్రారంభించారు. ఇదిలా ఉండగానే జగన్మోహన్ రెడ్డి తరువాత తానై పార్టీ నడిపిస్తున్న కీలక నేత వద్ద ఇటీవల కాలంలో తనకు పొన్నూరుకు అవకాశం ఇస్తే పోటీ చేస్తాను, ఆ ఒక్క సహాయం చేసి పెట్టమని రజిని అడిగారనేది విశ్వసినియ సమాచారంగా తెలుస్తుంది. చిలకలూరిపేట నియోజకవర్గంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన కార్యక్రమాలు తప్పితే సొంత కార్యక్రమాలు చేయకపోవడం, అడపాదడపా పరామర్శలు... పలు శుభ కార్యక్రమాలకు వచ్చి వెళ్లిపోవడం తప్పితే సొంత క్యాడర్ నూ దగ్గర చేసుకోవడంలో రజిని విఫలం అయ్యారనేది సొంత పార్టీ నేతలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. చంద్రబాబుకు వెన్నుపోటుకు రెండేళ్ల నిరసన కార్యక్రమం మైలేజ్ రాలేదు, వైసీపీకి ప్రధాన సామాజిక వర్గాలైన ఎస్సీ, బీసీ, మైనార్టీలు ఓటు బ్యాంకు గా ఉన్న సొంత పార్టీ నేతలను వదిలేసి ఇతర ప్రాంతాల నుంచి ప్రజలనూ తీసుకొచ్చారనేది సోషల్ మీడియా వేదికగా రజనీపై దుష్ప్రచారం జరుగుతుంది. దీనిపై నేతలు ఖండించకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. చిలకలూరిపేట నుంచి మళ్లీ పొన్నూరుకు పోటీ చేసే అవకాశం వస్తే రజిని వెళ్లిపోవచ్చనే చర్చ జోరందుకుంటుంది. గత అసెంబ్లీకి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు వెళ్లి పోటీ చేయాల్సి వచ్చిందని, మళ్లీ అదే డైలాగ్ మళ్లీ రిపీట్ కావచ్చు అనీ వైసిపి నేతలు గుస..గుసలాడుకుంటున్నారూ. ప్రస్తుతం పని చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తల పరిస్థితి మళ్లీ అగమ్య గోచరంగా నెలకొంటుంది. వైసీపీ బీసీ నాయకులు నగరికంటి శ్రీకాంతపై దాడితో రజిని అత్యంత మైనస్ లోకి వెళ్లారు. పార్టీ నేతపైన దాడి చేయిస్తే మునుముందు మా పరిస్థితి ఏంటి అనే ప్రశ్నలు ఉత్పనం అవ్వడమే కాకుండా శ్రీకాంత్ కుటుంబ సభ్యుల సైతం రజనీపై విమర్శలు చేశారు. దీంతో అర్బన్ పోలీసులు శ్రీకాంత్ సూచించిన 12 మంది వ్యక్తులకుగాను 4 వ్యక్తులను అరెస్టు చేశారు. ఇంతటితో ఆగకుండా రాష్ట్ర వైసిపి కీలక నేతలుగా ఉన్నటువంటి నాయకుల మొత్తానికి తన పైన జరిగిన దాడిని బహిర్గతం చేసి తనకు న్యాయం చేయాలని శ్రీకాంత్ కోరారు. ఇటీవల కాలంలో శ్రీకాంత్ తోపాటు మరి కొంతమంది వైసీపీ సీనియర్ నాయకులంతా జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి వైసీపీ కార్యాలయంలోను, బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో కలిసి చిలకలూరిపేటలో వైసీపీని కాపాడాలి... తమరి దగ్గర తీసుకున్న నగదు ఇప్పించాలని కోరారు. దీంతో జగన్మోహన్ రెడ్డి త్వరలోనే తమకు న్యాయం జరగబోతుందని హామీ ఇచ్చారు. ఆ నేతల్లో పొన్నూరు వెళ్లిపోతారనే సంకేతం ఆ నాయకుల్లో మెలుగుతుంది. ఏది ఏమైనప్పటికీ రాజకీయాల్లో పంతాలకు పోతే విమర్శలకు లోను కావడం తప్ప మరొకటి ఉండదు. విమర్శిస్తున్న నేతలను కలుపుకొని చిలకలూరి పేట నుంచి రజిని పోటీ చేస్తారా...లేక. పొన్నూరు నుంచి పోటీ చేస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది.

# సాయిరాం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెగా రక్తదాన శిబిరం



పలమనేరు, జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ( ఐఎంఏ ) పలమనేరు శాఖ ఆధ్వర్యంలో సాయిరాం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం అత్యంత విజయవంతంగా జరిగింది. సమాజంలో స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన పెంపొందించడం, అత్యవసర పరిస్థితుల్లో రక్త కొరతను తగ్గించడం మరియు మానవతా విలువలను ప్రోత్సహించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. యువత, ఉద్యోగులు, సామాజిక సేవకులు, వైద్య సిబ్బంది మరియు వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని 50 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ పలమనేరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. మమతా రాణి హాజరై రక్తదాతలను అభినందించారు. రక్తదానం అనేది అత్యున్నత మానవ సేవ అని, ఒక వ్యక్తి చేసిన రక్తదానం అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా మారుతుందని వారు పేర్కొన్నారు. సమాజంలో రక్తదానంపై అవగాహన పెంపొందించడంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వంటి సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయమని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పలమనేరు శాఖ అధ్యక్షులుడా. ఇ. యుగంధర్ గారి పాత్ర విశేషంగా నిలిచింది. కార్యక్రమం ప్రారంభం నుండి ముగింపు వరకు ప్రతి అంశాన్ని స్వయంగా పర్యవేక్షిస్తూ సభ్యులను సమన్వయం చేస్తూరక్తదాతలను ప్రోత్సహిస్తూ ఆయన ముందుండి నడిపించారు. వైద్య సేవలను కేవలం ఆసుపత్రులకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రజా ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పలమనేరు శాఖ గత కొన్నేళ్లుగా ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో ఆరోగ్య పరీక్షలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, పొగాకు మత్తు పదార్థాల వ్యతిరేక ప్రచారాలు, ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించే అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువవుతోంది. వైద్యుల సంఘంగా మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత కలిగిన సంస్థగా ఐఎంఏ పలమనేరు శాఖ ప్రత్యేక గుర్తింపు పొందింది. విలేకరులతో మాట్లాడిన డా. ఇ. యుగంధర్ రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. "రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవాలు, క్యాన్సర్ చికిత్సలు, థలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తం అత్యవసరంగా అవసరమవుతుంది. ఒక వ్యక్తి చేసిన రక్తదానం మూడు మంది ప్రాణాలను కాపాడగలదు. అందువల్ల ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా స్వచ్ఛంద రక్తదానం చేయాలి. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవు. ఇది పూర్తిగా సురక్షితమైన శాస్త్రీయంగా నిరూపితమైన ప్రక్రియ" అని ఆయన తెలిపారు.అలాగే యువతలో రక్తదానంపై ఉన్న అపోహలనుతొలగించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. సమాజంలో మానవత్వం, సేవా భావం మరియు పరస్పర సహకారాన్ని పెంపొందించడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రతి ఆరోగ్యవంతుడు సంవత్సరానికి కనీసం ఒకసారి అయినా రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా మనం ఎవరో ఒకరి ప్రాణాలను కాపాడగలమనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు.ఈ మెగా రక్తదాన శిబిరంలో స్థానిక వైద్యులు, ఐఎంఏ సభ్యులు, వైద్య సిబ్బంది, యువకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రశంసాపత్రాలు అందజేసి నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమం మొత్తం సేవా స్ఫూర్తి, సామాజిక బాధ్యత మానవతా విలువలకు ప్రతీకగా నిలిచింది.ప్రజారోగ్య పరిరక్షణ, సామాజిక సేవ వైద్య రంగ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పలమనేరు శాఖ భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. డా. ఇ. యుగంధర్ గారి నాయకత్వంలో పలమనేరు శాఖ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల ప్రశంసలు అందుకుంటూ, సమాజంలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరం పలమనేరు ప్రాంతంలో సేవా కార్యక్రమాలకు ఒక ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు

## రేపు జరిగే సప్తాహ భాగవత ముగింపు కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి : ఆచార్య





గద్వాల, శివసూర్య, జూన్ 14: జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయము నందు అనునిత్యం కొనసాగుతున్న సప్తాహ భాగవత మహోత్సవం రేపు ఘనంగా ముగియనున్న సందర్భంగా భక్తులు, అర్చకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వికాస తరంగిణి అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు.ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు భక్త జనులకు విజ్ఞప్తి చేశారు.

## 30సార్లు రక్తదానం చేసిన రామచంద్రారెడ్డికి ఆశీర్వచనం -- మంగళ శాసనాలు చేసిన చక్రవర్తి చార్యులు



అలంపూర్, శివసూర్య, జూన్ 14: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీకి చెందిన మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షులు భాజాపా రాష్ట్ర కమిటీ మెంబర్ రామచంద్రారెడ్డికి ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇప్పటికే 30 సార్లు రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారని జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు కొనియాడారు.ఈ సందర్భంగా రక్తదానం యొక్క ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, సేవా కార్యక్రమాలలో నిరంతరం పాల్గొంటున్న రామచంద్రారెడ్డికి చక్రవర్తి చార్యులు శుభాభివందనాలు, మంగళ శాసనాలు తెలియజేశారు.సమాజ సేవలో ముందుండి, ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఇదే సందర్భంలో జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన 42 సార్లు రక్తదానం చేసిన చక్రవర్తి చార్యులకు కూడా రామచంద్రారెడ్డి ప్రత్యేకంగా శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలిపారు

# తొర్రూరులో విషాదం.. పెట్రోల్ ట్యాంకర్ ఢీకొని యువకుడు మృతి



పల్లె వాణి . తొర్రూరు జూన్ 14 మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో ఆదివారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అన్నారం రోడ్డులోని భద్రకాళి ఆలయం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో గుర్తూరు గ్రామానికి చెందిన జడల నవీన్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, నవీన్ నెల్లికుదురు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కాంట్రాక్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో కుటుంబ సభ్యులతో గడిపేందుకు తొర్రూరుకు వచ్చిన ఆయన చేపలు కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన పెట్రోల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నవీన్ తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు.మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న నవీన్ ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పి ఉండేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన పెట్రోల్ ట్యాంకర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తోట మహేందర్ రెడ్డి తెలిపారు. అక్కడికి వచ్చిన యువతకు బైక్ మీద వెళ్ళేటప్పుడు హెల్మెట్ కచ్చితంగా ధరించి ఉంటే మృతుడు బ్రతికి ఉండేవాడు కదా అని అక్కడ ఉన్న స్థానికులను హెచ్చరించారు.రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతితో గుర్తూరు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# నర్సింహులపేట పరిధిలో భారీ కార్డాన్ సెర్చ్

పట్టిక గుడుంబా తయారీపై ఆకస్మిక దాడులు

గుడుంబా పై పోలీసుల ఉక్కు పాదం

నిషేధిత బెల్లం గుడుంబా అక్రమ తయారీ వ్యాపారుల

గుండెల్లో రైలు పరిగెత్తిస్తున్న ఎస్సై బానోత్ వెంకన్న





పల్లె వాణి నరసింహుల పేట జూన్ 14 మహబూబాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నర్సింహులపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు తండాల్లో తెల్లవారుజామున ముమ్మర కార్డాన్ సెర్చ్ నిర్వహించారు.ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఏకకాలంలో నిర్వహించిన తనిఖీలకు తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్ నాయకత్వం వహించగా, సీఐ గణేష్ పర్యవేక్షణలో పలువురు ఎస్‌ఐలు, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.గోప తండ, వాస్రం తండ, మూడ్ తండ, జగ్గు తండ, లాలి తండాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టారు. తనిఖీల్లో సుమారు 550 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయగా, 32 లీటర్ల గుడుంబా నాటు సారాయి 50 కిలోల నల్ల బెల్లం, 3 కిలోల పట్టికను స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు నర్సింహులపేట ఎస్‌ఐ బానోతు వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## పెద్ద చెరువు కాలువలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.

-కల్పన సునీల్ నాయక్.



బయ్యారం,జూన్ 14:బయ్యారం పెద్ద చెరువు కాలువలకు శాశ్వత మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందించాలని బిఆర్ఎస్ పార్టీ బయ్యారం మండల నాయకురాలు కల్పన సునీల్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం పెద్ద చెరువు సంబందించిన కాలువలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నాట్లు వేసే సమయంలో అధికారులు హడావిడిగా కాలువల మరమ్మతులు తూతూమంత్రంగా చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారని ఆమె విమర్శించారు.ఖరీఫ్ పంటకాలం ఆరంభమై జూన్ నెలలోనే నైరుతి రుతుపవనాలు రాకతో మండలంలో ఏజెన్సీ ఎగువ ప్రాంతంలో భారీ వర్ష పాతం నమోదు అయి చెరువులోకి నీరు భారీగా చేరే అవకాశం ఉన్నందున ముందస్తుగా కాలువలకు వెంటనే ప్రభుత్వం శాశ్వత మరమ్మతులు చేపట్టి ఆయకట్టు సాగు రైతులకు సక్రమంగా నీరు అందించాలని ఆమె కోరారు.లేని యేడల మండల రైతుల మద్దతుతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# శ్రీరామదండు108 కమిటి గార్ల అమావాస్య అన్నదానం



గార్ల జూన్ 14:మన గార్లలో శ్రీరామదండు 108 కమిటీ ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో సాగుతున్న "అమావాస్య అన్నదానం" కార్యక్రమం విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని, మూడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని భక్తులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అమావాస్య సందర్భంగా గార్ల తూర్పు ఆంజనేయ స్వామి ఆలయం, పుట్టకోట బజారు శ్రీ కోదండరామ స్వామి ఆలయం మరియు శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాల వద్ద భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా కట్టా రమేష్ మాట్లాడుతూ:ఒక చెట్టు ఎంత మహావృక్షంగా ఎదిగినా, దానికి ఆధారం భూమిలో బలంగా ఉండే వేర్లే. అలాగే మన వంశాభివృద్ధికి, మన ఎదుగుదలకు కారణం మన పితృదేవతల ఆశీస్సులే!నేటి కాలంలో ఎన్నో కుటుంబాలలో వివాహ దోషాలు, సంతానం కలగకపోవడం, మరికొన్ని తీవ్రమైన సమస్యలతో బాధపడుతూ లక్షల రూపాయలు ఖర్చు పెడుతుంటారు. కానీ, సనాతన ధర్మం ప్రకారం.ప్రతి అమావాస్య రోజున మన పితృదేవతలు మధ్యాహ్న సమయంలో మన ఇంటికి వచ్చి, 'మా పిల్లలు మమ్మల్నిగుర్తుంచుకున్నారా?' అని చూసి వెళ్తారు" అని మన పెద్దలు చెప్పిన మాట.చెట్టు వేరుకు పాదు తీసి నీరు పోస్తే అది ఎలా మహావృక్షం అవుతుందో... అలాగే మనం మన పితృదేవతల స్మరణార్థం చేసే సత్కర్మలు మన వంశాన్ని పచ్చగా ఉంచుతాయి.మన పితృదేవతల ఆశీస్సులు మన కుటుంబాలపై ఎల్లప్పుడూ ఉండాలన్నా, పితృదోషాలు తొలగిపోవాలన్నా అమావాస్య రోజున చేసే అన్నదానం అత్యంత శ్రేష్ఠమైనదని ఆయన తెలిపారు.అలాగే ఈ అన్నప్రసాదం కార్యక్రమానికి సహకరించిన దాతలకు మరియు ప్రసాదాన్ని స్వీకరించిన భక్తులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామదండు 108 కమిటీ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# బడి గంట వేళ ప్రవేట్ స్కూలు వ్యాన్ భద్రమైన ..




చిట్యాల: జూన్ 14 :బడి తెరిచే సమయం సోమవారం వారం రోజు ఆసన్నమైంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు కావలసిన స్కూల్ మెటీరియల్ను , వారి అవసరాలన్నీ సిద్ధం చేయడానికి నిమగ్నమైపోతున్నారు. పాఠశాల ఎంపిక అక్కడి వాతావరణం, గేమ్స్, మౌలిక వసతుల గురించి ఆరాతీసి స్కూల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. దూరంగా ఉన్న గ్రామాలకు స్కూల్ వ్యాన్ సౌకర్యం కలదని ప్రైవేటు స్కూల్ చిట్యాల మండలం యజమాన్యం చెప్పగానే, సంబరపడిపోయి పిల్లల తల్లిదండ్రులు ఆ పాఠశాలలోనే అడ్మిషన్లు తీసుకుంటున్నారు.. ప్రవే టుస్కూల్ వ్యాన్ భద్ర మేన ...?పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రవేట్ పాఠశాలల వైపు అడుగులు వేస్తూ, స్కూల్ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే, అక్కడ భౌతికంగా కనిపించే బొమ్మలు, ఆట వస్తువులు, క్లాస్ రూములకు ఆకర్షితులు అవుతున్నారు తప్ప, ఏ ఒక్క పిల్లల తల్లిదండ్రులు కూడా స్కూల్ వ్యాన్ కు సంబంధించిన, ఏ ఒక్క చర్చ జరపడం లేదు. వ్యాన్ ఎన్ని సంవత్సరాల క్రితం అని, డ్రైవర్ అనుభవం, అతని వయసునుగాని, వ్యాన్ ఫిట్నెస్ గురించిన అంశాన్ని ఐదు నిమిషాలు ఆరా తీయక చర్చించకపోవడంతో, ప్రమాదాలు మధ్యలోనే చోటు చేసుకుంటున్నాయి. ప్రవేట్ యాజమాన్యాలు డ్రైవర్లను తమకు అనుకూలంగా ఉన్న వారిని, తక్కువ జీతం వచ్చే వారిని తరచూ మార్చుతూ, అనుభవం, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారితో విద్యా సంవత్సరాన్ని వారు పూర్తి చేయిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో, స్కూల్ వ్యాన్ కు రంగులు అద్ది చూపెడుతున్నారే తప్ప, దాని యొక్క ఫిట్నెస్ సంబంధించిన సర్టిఫికెట్ను చూపించరు. తల్లిదండ్రులు కూడా అడగరు. వ్యాన్ పై రంగులను చూసి బాగుందని పిల్లలను జాయిన్ చేస్తారు. అనుకోకుండా షార్ట్ సర్క్యూట్ వల్ల, ఇంకా ఇతర ప్రమాదం జరిగితే, పిల్లల తల్లిదండ్రులు అమాయకంగా కన్నీరు కారుస్తున్నారు. గత ఫిబ్రవరి నెలలో మండలంలో ని ప్రవేట్ స్కూల్ వ్యాన్ షార్ట్ సర్క్యూట్తో దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తంతో అందులో ఉన్న పిల్లలు సేఫ్గా బయటపడ్డారు. లేకపోతే భారీ మూల్యం జరిగేది. వారి కళ్ళ ముందు ఇంత జరిగిన, ఆ తల్లిదండ్రులు ఆ పాఠశాల వైపే మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ వైపుకు, క్లాస్ రూమ్లను లక్షలు వెచ్చించి తీర్చిదిద్దిన, శిక్షణ, అనుభవం గల టీచర్స్ ఉన్న, కొంతమంది పేరెంట్స్ తమ హోదా కోసం ప్రైవేట్ పాఠశాల వైపు వెళుతున్నారు. . కఠిన నిబంధనలు ఉండాలి ప్రభుత్వం స్కూల్ వ్యాన్ లను నడిపే ప్రవేట్ యజమాన్యాల కు స్కూల్ వ్యాన్ ఫిట్నెస్ అంశాన్ని కఠిన తరం చేసి, ఫిట్నెస్ ఉన్న స్కూల్ వ్యాన్లకే పర్మిషన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని, రెప్పపాటు వేసులుబాటు ఇచ్చిన పిల్లల భవిష్యత్తు, తల్లిదండ్రుల కలలు వారి జీవితాంతం వెంటాడుతుంటాయి. ఆరు నెలలకు ఒకసారి తప్పకుండా తనిఖీలు చేసేలా చేసి చర్యలు చేపట్టాలి. మళ్లీ అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వమే కఠిన నిర్ణయాలు నిబంధనలను చేపట్టాలి.

# ప్రభుత్వము ఆమోదించిన విత్తనాలనే కొనుగోలు చేయాలి

ఫర్టిలైజర్ చిట్యాల మండల కమిటీ

అధ్యక్షులు పువ్వాటి హరికృష్ణ



చిట్యాల. జూన్ 14 : రైతులు ప్రభుత్వ ఆమోదం పొందిన విత్తనాలనే కొనుగోలు చేయాలి..విత్తనాలు మొలకెత్త ఎడల దిగుబడి సరిగా రాని యెడల పూర్తి బాధ్యత కంపెనీలదె ఉంటుందని దానికి షాపు యజమానులది ఎలాంటి బాధ్యత ఉండదని నూతనంగా ఎన్నికైన చిట్యాల మండలం ఫర్టిలైజర్స్ షాపు అసోసియేషన్ అధ్యక్షులు పువ్వాటి హరికృష్ణ తెలిపారు. ఆదివారం చిట్యాల మండల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ విత్తన అసోసియేషన్ అధ్యక్షుడిగా మాట్లాడుతూ రైతులు చిట్యాల మండల వ్యాప్తంగా ఉన్న లైసెన్స్ ఫర్టిలైజర్ షాప్ యజమానుల నుండి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వ ఆమోదితం పొందిన విత్తనాల్ని కొనుగోలు చేయాలని నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి ఇబ్బందులు ఎదుర్కోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆమోదం పొందిన విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు అవి సరిగా దిగుబడి రానిపక్షంలో దాని పూర్తి బాధ్యత ఉత్పత్తి చేసిన కంపెనీలదే ఉంటుందని సరైన దిగుబడి రానప్పుడు మొలకలు సరిగా మొలకెత్తినప్పుడు షాపు యజమానుల కంపెనీ డీలర్లను పిలిపిస్తారు. దానికి సంబంధించిన నష్టం విత్తనం వల్ల జరిగినప్పుడు కంపెనీ ధ్రువీకరించి నష్టపరిహారం ఏదైనా ఉంటే కంపెనీ చెల్లిస్తుందని మండల వ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్ షాపుల యజమానులకు ఎలాంటి సంబంధం ఉండదని విజ్ఞప్తి చేశారు. ఫర్టిలైట్ షాప్ యజమానులు కూడా నకిలీ విత్తనాలను రైతులకు అమ్మకుండా ప్రభుత్వ ఆమోదం పొందిన విత్తనాలను అమ్మాలని విజ్ఞప్తి చేశారు.సరియైన దిగుబడి రానప్పుడు, విత్తనాలు సరిగ్గా మొలకెత్తనప్పుడు లేదా నకిలీవని తేలినప్పుడు ఆ నష్టానికి విత్తనాలు ఉత్పత్తి చేసిన కంపెనీ (గ్రతీశీఎబఎవతీ/జశీఎజూఋఅఎ) మరియు విత్తనాలు విక్రయించిన డీలర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్న రూ అయితే, దీనిలో ఎవరి బాధ్యత ఎంత మీరు ఎవరిని నిలదీయాలో కింద వివరంగా తెలుసుకోవచ్చు. అధికారిక విత్తనాలు: డీలర్లు ప్రభుత్వం అనుమతించిన (=వస్త్రఅరవతీ అయిన) కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలి.రసీదు ఇవ్వడం: విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లు లేదా రసీదు ఇవ్వాలి రైతులు తప్పనిసరిగా రసీదు అడివి తీసుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు నియమ నిబంధనలు పాటించాలి విత్తనాల నాణ్యత తగ్గకుండా వాటిని సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి.ఉత్పత్తి చేసిన కంపెనీ బాధ్యత:నాణ్యతకు హామీ: విత్తనాల మొలకెత్తే శాతం (+వతీఎఅఅఫ్అశీఅ), జన్యుపరమైన స్వచ్ఛత (+వఅవ్అష గ్రాబతీఫ్ఎ) వంటి వాటికి కంపెనీయే పూర్తి బాధ్యత వహిస్తుంది.నష్టపరిహారం చెల్లించడం: నకిలీ లేదా నాసిరకం విత్తనాల వల్ల రైతులకు పంట నష్టం జరిగితే, కంపెనీలు రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. రైతులకు ఉన్న చట్టపరమైన హక్కులు:పరిహారం పొందే హక్కు: చట్టం ప్రకారం, రిజిస్టర్డ్ విత్తనాలు సరిగ్గా పనిచేయకపోతే రైతులు పరిహారం (జశీఎజూవఅయ్అశీఅ) క్లెయిమ్ చేసుకోవచ్చు. వినియోగదారుల ఫోరమ్: డీలర్ ఇచ్చిన బిల్లు మరియు విత్తనాల ప్యాకెట్ ఆధారంగా, మోసపోయిన రైతులు "వినియోగదారుల రక్షణ చట్టం (జశీఅంబఎవతీ గ్రాతీశీవషఅశీఅ-చాఫ్)" కింద పరిహారం కోసం కేసు వేయవచ్చు. సేల్స్ ఇన్స్పెక్టర్ కు ఫిర్యాదు చేసే అధికారం రైతులకు ఉంటుందన్నారు.రైతులకు సరైన దిగుబడి రాకపోతే వెంటనే జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు లేదా మండల వ్యవసాయ అధికారికి (ూజూ) ఫిర్యాదు చేయాలి. రైతులకు వ్యవసాయం, విత్తనాలకు సంబంధించిన ఏవైనా సందేహాలు లేదా సలహాలు కావాలంటే రైతునేస్తం వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చు సలహాలు తీసుకోవచ్చు. అంతేగాని ఫర్టిలైజర్స్ ఫస్టిసైడ్స్ షాపుల యజమానులకు ఎలాంటి బాధ్యత ఉండదని విజ్ఞప్తి చేశారు రైతులు ఇది గమనించి తప్పనిసరిగా ప్రభుత్వ ఆమోదం పొందిన విత్తనాలను కొనుగోలు చేయాలని అది కూడా ప్రభుత్వం లైసెన్స్ ఉన్న షాపుల వద్దనే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కోసం అనునిత్యం ఫర్టిలైజర్ షాప్ యజమానులు పనిచేస్తారని విజ్ఞప్తి చేశారు. చిట్యాల మండల ఫర్టిలైజర్స్ ఢ పెస్టిసైడ్స్ యూనియన్ ప్రెసిడెంట్,పువ్వాటి హరికృష్ణ, అన్నారు నకిలీ విత్తనాలు ఫర్టిలైజర్ షాపు యజమానులు అమ్మితే రైతులు ఈ నంబరుకు ఫోన్ చేయగలరని విజ్ఞప్తి చేశారు 9951262675.

## .డిజిటల్ క్లాస్ రూమ్లు గా మార్చాము.తిరుపతయ్య ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నైన్ పాక

పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం తో పాటు అన్ని క్లాసు రూమ్లను డిజిటల్ గా మార్చాము. పిల్లలకు స్పెషల్ క్లాసులు నిర్వహించి, హోం వర్క్ ను సాయంత్రం వేళ వారి తల్లిదండ్రులకు చేరవాణి ద్వారా సమాచారాన్ని తెలిపి, వర్కును చేపించి, ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటున్నాం. ఇంకా కొంతమంది పేరెంట్స్ ప్రభుత్వ పాఠశాలను చిన్న చూపుగా చూస్తూ, పిల్లలను పంపించడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, రవాణా సౌకర్యం అన్ని ఉచితంగా ప్రభుత్వమే పంపిణీ చేస్తున్నాయి. ఇంకా ఆలోచించాల్సిన పని ఏముందో తల్లిదండ్రులే ఆలోచించుకోవాలని, ప్రభుత్వ బడికే ప్రాధాన్యత ఇవ్వాలని తిరుపతయ్య అన్నారు.

## జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామంలో విషాదం చోటుచేసుకుంది



చిట్యాల. జూన్ 14 : జయశంకర్ జిల్లా భూపాలపల్లి మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వడగళ్ల వర్షం ప్రభావంతో తీవ్ర ప్రభావం ఏర్పడి గ్రామంలో భారీ వృక్షాలు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి ఈ క్రమంలో గ్రామ పొలిమిరలో విద్యుత్ వైరు తెగిపడి ఏడు పాడి గేదెలు మృతి చెందాయి గ్రామంలోని పశువుల కాపరి రోజువారి లాగా గ్రామంలోని పశువులను మేత కోసం గ్రామ పొలిమేరలోకి తొలుకుపోగా వర్ష ప్రభావంతో తెగిపడ్డ విద్యుత్ వైరు తాకి ఏడు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి మృతి చెందిన పశువుల విలువ సుమారుగా 5 లక్షలు ఉంటుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు 1.వేముల భూమారావు o/శీ బుచ్చి రామారావు. (పాలిచ్చే బర్రె మరియు దూడ) 2.వేముల బాపురావు o/0 నర్సింగరావు( పాలిచ్చే బర్రె)3. రత్న రవి o/0 నరసయ్య ( చూడు బర్రె )4. బల్గూరి సంపత్రావు o/0 చిన్న బుచ్చి రామారావు( పాలిచ్చే బర్రె)5. కీర్తి లింగయ్య o/0 పోచయ్య( పాలిచ్చే బర్రె)6. ఇంజపల్లి రాజయ్య o/0 శీఋఋష్ట( చూడి బర్రె) మొత్తం 7 రంగాపూర్ గ్రామంలో విద్యుత్ చాయి చనిపోవడం జరిగింది

## ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న రాష్ట్ర సీనియర్ నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ

టేకుమట్ల మండల ఇంచార్జి మంద తిరుపతి మాదిగలి




చిట్యాల. జూన్ 14 : జయశంకర్ జిల్లా భూపాలపల్లి టేకుమట్ల మండల ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం రేపు అనగా 15/06 /2026 రోజున ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ మరియు టేకుమట్ల మండల ఇంచార్జ్ మంద తిరుపతి మాదిగ టేకుమట్లకు ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరవుతున్నారు కావున టేకుమట్ల మండలంలో ఉన్నటువంటి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు రేపు సమయం 10:30 ూఎ వరకు ఎమ్మార్పీఎస్ నాయకులంతా మండలానికి చేరుకోవాలని కోరడం జరుగుతుంది పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల అనుసారం గో టు విలేజ్ మరియు జండా గద్దెల నిర్మాణం మరియు జెండా ఆవిష్కరణ పలు అంశాలపై దిశా నిర్దేశం చేయుటకు విచ్చేస్తున్న రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ టేకుమట్ల మండల ఇన్చార్జ్ మంద తిరుపతి మాదిగ టేకుమట్ల మండలంలో ఉన్నటువంటి ఎమ్మార్పీఎస్ అనుబంధం సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేసినారు ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు రామ్ రామ్ చందర్ మాదిగ అన్నారు

# సొంత గడ్డపై తనవంతు చేయూత, ,, రష్మిక ,విజయ్ దేవరకొండ.




అచ్చంపేట పల్లెవాణి న్యూస్: అచ్చంపేట విద్యాచరిత్రలో ఇది ఒక సువర్ణ అంశం అని చెప్పక తప్పదు, సొంతవారినే మరిచిపోయే ఈ సమాజంలో మనది,,,,, అంటూ,,,ఒక గుర్తుండిపోయే విధంగా ఉండాలి, అని తన ఆలోచనలో మెరిసినటువంటి వెలుగు లు మన ప్రాంత విద్యార్థులవిద్యలో పోటీ తత్వం కలిగి ముందు ఆ విద్యార్థులు ఉన్నత స్థాయిలో చేరుకునే విధంగా మా వంతు కృషి చేయాలని సంకల్పంతో ముందుకు వచ్చారు "మన తెలుగు హీరో విజయ్ దేవరకొండ, అతని సతీమణి రష్మిక దేవరకొండ, నాగర్ కర్నూల్ జిల్లా లోని :బల్ మూర్ మండలం " తుమ్మనపేట గ్రామానికి చెందిన తెలుగు సినిమా హీరో విజయ్ దేవరకొండ , తన వివాహ వేడుకలో అతని సతీమణి "రష్మిక దేవరకొండ"లకు కలిగిన ఆలోచన మన ప్రాంతానికి ఏదైనా చేయూత చేయాలి, అనే తలంపుతో ఈ సంవత్సరం అచ్చంపేట నియోజకవర్గంలో పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 10వ తరగతిలో అత్యధికమార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని ప్రకటించారు, ప్రథమ బహుమతివిద్యార్థులకు10, 116రూపాయ లు, ద్వితీయ బహుమతి విద్యార్థులకు 5,1116 బహూకరిస్తామని ప్రకటించారు,అన్నమాటనును నిలబెట్టి ఈ రోజు అచ్చంపేట పట్టణానికి విచ్చేసిన, రస్మిక విజయ్ దేవరకొండ దంపతులు ఈ అద్భుతమైన ప్రోత్సాహకాన్ని 188మంది విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ ద్వారా ఇప్పించారు, ఈ విషయాన్ని పురస్కరించుకొని దంపతులిద్దరూ ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు, ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ మాట్లాడుతూ మన అచ్చంపేట విద్యార్థులు ఎందులోనూ తక్కువ కారు, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే ఆకాశమే హద్దుగా రాణిస్తారు అని తెలిపారు, సొంత ఊరిపై ప్రేమతో మన పిల్లల చదువుకు అండగా నిలిచిన తమ్ముడు విజయ్ దేవరకొండ, రస్మిక లకు నా ప్రత్యేక అభినందనలు, అచ్చంపేట నియోజకవర్గంలో ని విద్యార్థుల ఉన్నత చదువులకు వారి ఉజ్వల భవిష్యత్తు కు నా వంతు సపోర్ట్ ఎల్లవేళలాఇలాగే ఉంటుందని తెలిపారు, ఈ అద్భుతమైన ప్రోత్సాహకాన్ని అందుకున్న 188మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు , ఈ స్ఫూర్తి తో మీరంతా భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, మన ఖ్యేష్ట్రీ కీర్తిని దశదిశల చాటాలని కోరుకుంటున్నాము అని తెలిపారు, రస్మిక విజయ్ దేవరకొండ దంపతుల ఉదారతకు మన అచ్చంపేట ప్రజల తరుపున ధన్యవాదాలు తెలియజే సారు, నూతన వివాహ బంధం లోకి అడుగు పెట్టిన ఈ స్టార్ కపుల్స్ జీవితం ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటు మీ దాతృత్వం మరువలేనిదని కొనియాడారు, ఈ కార్యక్రమంలో హీరో రస్మిక విజయ్ దేవరకొండ కుటుంబ సభ్యులు , స్థానిక ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ, వివిధ గ్రామాల్లో నుండి వచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రు లు, అభిమానులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై విషాదం.. గొర్ల మందపైకి దూసుకెళ్లిన పాల వ్యాన్




. తొర్రూరు జూన్ 14 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల పరిధిలోని ఫతేపురం గ్రామ శివారులో వరంగల్--ఖమ్మం జాతీయ రహదారిపై విషాదకర ఘటన చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన మహీంద్రా గూడ్స్ పాల వ్యాన్ గొర్ల మందపైకి దూసుకెళ్లడంతో సుమారు 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 10 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి.స్థానికుల వివరాల ప్రకారం పత్తేపురం గ్రామానికి చెందిన గట్టిగొల్ల వెంకన్న, ఐలయ్య, వెంకన్నలకు చెందిన గొర్ల మందను రహదారి వెంట తోలుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ప్రమాదం కారణంగా గొర్రెల యజమానులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది.ఘటన సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని గాయపడిన గొర్రెలకు సహాయక చర్యలు



చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం వేగమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.అతివేగం ప్రాణాలు, ఆస్తులకు ప్రమాదకరం. జాతీయ రహదారులపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

## జుట్టు కోసం కొబ్బరినూనెను వాడాలా.. లేక కొబ్బరిపాలనా..?



జుట్టు పొడవుగా, ఒత్తుగా ఉండేలా ఎన్నో రకాల ఉత్పత్తులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. మీరు మీ జుట్టు సంరక్షణ దినచర్యలో ఈ ఫ్యాన్సీ ఉత్పత్తులను ఉపయోగిస్తుంటే, మీరు తప్పనిసరిగా అందులో మార్పులు చేయవలసి ఉంటుంది. జుట్టు అందాన్ని పెంపొందించుకోవడానికి ఒకవైపు మార్కెట్‌లో లభించే కెమికల్ ప్రొడక్ట్స్‌ను వాడుతూనే, మరోవైపు కొందరు ఇంటి నివారణల సాయం కూడా తీసుకుంటారు. జుట్టు సంరక్షణ పేరు వినగానే చాలా మందికి కొబ్బరినూనె గుర్తుకు వస్తుంది. దేశంలోని చాలా మంది ప్రజలు కొబ్బరి నూనెతో తలకు మసాజ్ చేయడానికి ఇష్టపడతారు. ఇది మీ జుట్టును మూలాల నుండి కండిషన్ చేస్తుంది మరియు పోషణను కూడా అందిస్తుంది. అయితే మీరు వారానికి ఒకసారి కొబ్బరి పాలతో చేసిన హెయిర్ మాస్క్‌ను కూడా అప్లై చేసుకోవచ్చు. ఆరోగ్యకరమైన జుట్టు కోసం కొబ్బరి నూనె లేదా కొబ్బరి పాలు.. రెండింటిలో ఏది వాడాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. ఇందుకు వైద్య నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు చూద్దాం. ఈ రోజుల్లో, చాలా మంది జుట్టుకు నూనె రాయడానికి ఇష్టపడడం లేదు. అటువంటి పరిస్థితిలో మీరు వారానికి ఒకసారి కొబ్బరి పాలతో చేసిన హెయిర్ మాస్క్‌ను అప్లై చేయవచ్చు. ఇందులో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ జుట్టుకు అంతర్గత పోషణను అందిస్తాయి. అయితే, పొడవాటి జుట్టు కోసం మనం కొబ్బరి నూనె లేదా కొబ్బరి పాలను అప్లై చేయాలా అనే ప్రశ్న తరచుగా చాలా మంది మనస్సులో ఉంటుంది. ఆరోగ్యకరమైన జుట్టు కోసం మీరు ఈ రెండింటిలో దేనిని అప్లై చేయాలి అనే వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. కొబ్బరి నూనె మీ జుట్టును లోపలి నుండి కండిషన్ చేయడానికి సహాయపడుతుంది. పొడి, దెబ్బతిన్న మరియు నిస్తేజమైన జుట్టు కోసం కొబ్బరి నూనెను ఉపయోగించడం మంచిది. కొబ్బరి నూనెలో లారిక్ యాసిడ్, విటమిన్లు ఇ మరియు కె మరియు ఐరన్ పుష్కలంగా ఉంటాయి, దీని కారణంగా తలకు మరియు జుట్టుకు అవసరమైన పోషణ లభిస్తుంది. కొబ్బరి నూనెలో యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉంటాయి, దీని కారణంగా ఇది చుండ్రు మరియు ఇతర స్కాల్ప్ ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది. అటువంటి పరిస్థితిలో, రుతుపవనాల సమయంలో స్కాల్ప్ ఇన్ఫెక్షన్‌ను నివారించడానికి మీరు కొబ్బరి నూనెను ఉపయోగించవచ్చు. మీరు వేడి స్టైలింగ్ సాధనాలను ఉపయోగించే ముందు కొబ్బరి నూనెను కూడా ఉపయోగించవచ్చు. ఇది మీ జుట్టు పాడవకుండా కాపాడుతుంది. కొబ్బరి పాలు దాని మాయిశ్చరైజింగ్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి, ఇవి మీ తల చర్మం మరియు జుట్టును హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతాయి. మీ జుట్టు చాలా పొడిగా లేదా నిర్జీవంగా ఉంటే, మీరు కొబ్బరి పాలతో హెయిర్ మాస్క్‌ని సిద్ధం చేసుకోవచ్చు. కొబ్బరి పాలలో విటమిన్ సి, ఇ, బి1, బి3, బి5 మరియు బి6 వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. అదనంగా, ఇందులో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం మరియు సెలీనియం కూడా ఉంటాయి, ఇది మీ జుట్టును ఆరోగ్యంగా మరియు మృదువుగా చేస్తుంది. కొబ్బరి పాలలో పుష్కలంగా ప్రోటీన్ ఉంటుంది, దీని కారణంగా జుట్టు నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీనితో పాటు, జుట్టు రాలడాన్ని నివారించడం ద్వారా జుట్టు పెరుగుదలను పెంచడంలో సహాయపడుతుంది.

## ఈ హెర్బల్ డ్రింక్స్ తీసుకోండి

### కొలెస్ట్రాల్ మరియు గుండె సమస్యలకు చెక్ పెట్టండి.!



మనం ఉన్న ఈ ఆధునిక కాలంలో జీవన శైలి మరియు చెడు ఆహార అలవాట్ల వలన ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాం.అందులో చాలా మంది గుండె సమస్యలతో బాధపడుతున్నారు. గుండె సమస్యలు వచ్చేందుకు చాలా కారణాలు కూడా ఉన్నాయి. అయితే గుండె రక్తనాళాల్లో ఫలం అనేది పేరుకుపోయి దానికి అడ్డుపడుతుంది. ఇది కొలెస్ట్రాల్ మరియు కాల్షియం ఇతర రక్త భాగాలలో కూడా తయారు అవుతుంది. అలాగే రక్తనాళాల్లో మందపాటి పోర అనేది ఏర్పడడం వలన కూడా రక్తప్రసరణ జరగదు. దీనిని నియంత్రించేందుకు ఉదయాన్నే కొన్ని డ్రింక్స్ తీసుకోవడం చాలా అవసరం. ఇది కొలెస్ట్రాల్ ను బయటికి పంపేందుకు,హృదయ ఆరోగ్యాన్ని కాపాడేందుకు కూడా ఎంతగానో మేలు చేస్తుంది. ఆ డ్రింక్స్ ఏమిటో ఇప్పుడు మనం చూద్దాం.. నిమ్మరసం ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో ఈ నిమ్మ రసాన్ని గనక తీసుకున్నట్లయితే గుండె ఆరోగ్యంగా మారుతుంది. అలాగే ఇది గుండె రక్తనాళాలను సహజంగానే బాగుచేస్తుంది. నిమ్మకాయ లో ఉండే సిట్రస్ యాసిడ్ ఫలకాన్ని తొలగించి రక్తప్రసరణకు ఎంతో మెలు చేస్తుంది. దీని వలన జీవ క్రియ కూడా ఎంతో మెరుగ్గా ఉంటుంది. అలాగే గుండె ఆరోగ్యం కూడా ఎంతో బాగుంటుంది.. పసుపు, మిరియాల పాలు : దీనిలో యాంటీ ఇన్ఫ్లమెంటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉంటాయి. ఈ పాలను తీసుకున్నట్లయితే రక్తనాళాల్లో ఫలకం అనేది తయారవ్వకుండా చూస్తుంది. అంతేకాక గుండె సమస్యల ప్రమాదాలను కూడా నియంత్రిస్తుంది. అయితే ఒక గ్లాసు వేడి పాలల్లో కొద్దిగా పసుపు మరియు చిటికెడు మిరియాల పొడిని వేసుకొని తాగితే చాలా మంచిది ఉసిరి రసం : ఉసిరి రసంలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. దీనిని కూడా కాళీ కడుపుతో తీసుకున్నట్లయితే గుండె కండరాలు ఎంత మెరుగ్గా తయారవుతాయి. అలాగే కొలెస్ట్రాల్ మరియు వాపు ను కూడా నియంత్రిస్తుంది మెంతుల నీరు : మెంతులను గనక నానబెట్టుకొని ఆ నీటిని కనుక తీసుకున్నట్లయితే కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తుంది. మెంతులను రాత్రి టైం లో నీటిలో నానబెట్టుకొని ఉదయం లేవగానే తీసుకుంటే మంచిది. దీని వలన రక్తనాళాల్లో పోర అనేది తగ్గుతుంది.అలాగే గుండె పనితీరు కూడా ఎంతో మెరుగుపడుతుంది వెల్లుల్లి టీ : వెల్లుల్లి ఆరోగ్యానికి ఎంతో మంచిది. వెల్లుల్లి గుండె ఆరోగ్యానికి కూడా ఎంతగానో రక్షిస్తుంది. దీనిని టీ రూపంలో తీసుకున్నట్లయితే కొలెస్ట్రాల్ కూడా తగ్గి రక్తనాళాల మందాన్ని కూడా నియంత్రిస్తుంది. మీరు ప్రతిరోజు గనుక గార్లిక్ టీ ని తీసుకున్నట్లయితే రక్తనాళాల్లోని అడ్డంకులు కూడా సహజంగా తొలగిపోతాయి గ్రీన్ టీ : గ్రీన్ టీ ని తీసుకోవటం వలన బరువు కూడా తొందరగా తగ్గుతారు. అలాగే గుండె రక్తనాళాలను శుద్ధి చేయటానికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే బ్రేక్ ఫాస్ట్ తర్వాత ఒక కప్పు గ్రీన్ టీ తీసుకున్నట్లయితే గుండె రక్తనాళాలు ఎంతో శుభ్రంగా ఉంటాయి. అలాగే గుండె సమస్యలు కూడా దూరం అవుతాయి. అల్లం దాల్చిన చెక్క టీ : గుండె ఆరోగ్యాన్ని రక్షించడంలో ఈ రెండు కూడా ముందు వరుసలో ఉంటాయి. అలాగే అల్లం రక్తనాళాల వాపును కూడా నియంత్రిస్తుంది. అయితే దాల్చిన చెక్క రక్తంలో చక్కెర స్థాయిలను కూడా నియంత్రిస్తుంది. అంతేకాక రక్త ప్రసరణ కూడా ఎంతో మెరుగుపడేలా చేస్తుంది. ఈ రెండిటిని కలిపి టీలా చేసుకొని తాగినట్లయితే మీ బాడీలోని కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది.అలాగే గుండె రక్తనాళాలు సక్రమంగా పని చేయటంలో కూడా సహాయం చేస్తుంది

## ఈ ఐటమ్స్ తో కలిపి టీ తాగుతున్నారా.. అయితే జర జాగ్రత్త



చాలా మంది ఉదయం టీతో ప్రారంభిస్తారు. కొంతమందికి ఇది చాలా ఇష్టం, వారు రోజుకు చాలా కప్పుల టీ తాగుతారు. కొందరికి టీతో పాటు ఏదైనా తినే అలవాటు ఉంటుంది. వీటిలో రోటీ, బిస్కెట్లు లేదా పకోడాలను ఇష్టపడతారు. టీతో కొన్ని పదార్థాలు తినడం ప్రమాదకరం, అయితే టీతో పాటు తీసుకుంటే చాలా తీవ్రమైనది కావచ్చు. ఈ విషయం ఏంటో తెలుసుకుందాం చాలా మంది టీ, స్నాక్స్ కలిసి తినడానికి ఇష్టపడతారు. ఇంట్లో అతిథులకు టీతోపాటు పకోడాలు కూడా ఇస్తారు, అయితే ఈ కాంబినేషన్ అనేక సమస్యలను పెంచుతుందని చాలా తక్కువ మందికి తెలుసు. నిజానికి, టీతో పాటు ఉప్పు లేదా గింజలు తినడం ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తుంది. ఏదైనా ఉప్పగా ఉండే పదార్థం టీతో ప్రతిస్పందిస్తుంది, దీని వలన కడుపు నొప్పి వస్తుంది. టీలో టానిన్లు ఉంటాయి, ఇవి ఉప్పులో ఉండే ఇనుము మరియు ఇతర పోషకాలను నాశనం చేస్తాయి. టీతో పకోడీలు తింటే జీర్ణవ్యవస్థ బలహీనపడుతుంది. ఇది అనేక ఇతర కడుపు సంబంధిత సమస్యలను కలిగిస్తుంది, కాబట్టి టీతో ఉప్పు లేదా శనగ పిండి పదార్థాలను ఎప్పుడూ తినకూడదు. పుల్లటి చీజ్ లేదా నిమ్మకాయతో చేసిన ఏదైనా టీతో తినకూడదు. నిజానికి, నిమ్మలో ఉండే ఆమ్ల మూలకాలను కలపడం ద్వారా టీ కడుపులో ఆమ్లాన్ని సృష్టించగలదు. దీని కారణంగా గుండె మంట సంభవించవచ్చు.

# ఏ వయసులో ఏ ఆహారం





ఆహారానికి వయసు ఉండదు కానీ, ఏ వయసుకు తగ్గ ఆహారం ఆ వయసులో తీసుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుంటాయంటున్నారు పోషకాహార నిపుణులు. ఎదిగే వయసు పిల్లలు తీసుకోవలసిన ఆహారంలో ఉండవలసినవి వృదులు తీసుకోవలసిన ఆహారం ఒకటి కాదు. అదేవిధంగా టీనేజీ అమ్మాయిలు, యాభైలలో ఉండే స్త్రీలు వేర్వేరు ఆహారాలు తీసుకోవాలి. ఇంతకీ ఏ వయసు వారు ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దామా? ఇప్పుడు పిల్లలు తినే ఆహారంలోప్రోటీన్లు తక్కువబీ పిండి పదార్థాలు, కొవ్వులు ఎక్కువ ఉంటున్నాయి. ఇలాంటి ఆహారం తినటం వల్ల వయసుకు తగిన పెరుగుదల ఉండదు. అధిక బరువు, హార్మోన్లలో మార్పుల లాంటి సమస్యలు మొదలవుతాయి. కాబట్టి ఈ వయసు నుంచే సమతులాహారం ఇస్తూ ఆహారంలో ప్రోటీన్లు ఎక్కువగా ఉండేలా చూసుకోగలిగితే భవిష్యత్తులో హైపర్‌టెన్షన్, మధుమేహం, రక్తపోటు మొదలైన ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి కాబట్టి గుడ్లు, ఆకుకూరలు, తాజాపళ్లు, కూరగాయలు˘బాదం, వాల్‌నట్స్, వేరుసెనగ˘గోధుమలు, పెసలు, పాలు, వెన్న, పెరుగు మాంసం, చేపలు, జున్ను రాజ్మా, సెనగలు, బొబ్బర్లు, సాయంత్రం అల్పాహారంగా బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఉడకబెట్టిన సెనగలు, మొక్కజొన్నలాంటివి ఇవ్వాలి.

### 15 నుంచి 25 ఏళ్ల వయసు

తక్కువ నూనె, తీపి, మసాలాలతో రుచికరమైన స్నాక్స్ వండే విధానాలను నేర్చుకుని పిల్లల మనసు గెలవగలిగితే బజార్లో దొరికే ఫాస్ట్ ఫుడ్స్‌కు పిల్లలు ఆకర్షితులవకుండా ఉంటారు ˘అలాగే మాంసాహారం వండేటప్పుడు ఎక్కువ నూనెలో వేయించకుండా ఆవిరి మీద ఉడికించి ఇవ్వాలి మాంసాహారంతోపాటు కూరగాయలు కూడా ఇవ్వాలి ఆహారంలో తగినంత పీచు పదార్థం ఉండేలా చూసుకుంటే పోటీన్ ఫుడ్ వల్ల మలబద్ధకం తలెత్తకుండా ఉంటుంది ఉదయం అల్పాహారంలో బ్రెడ్, శాండ్‌విచ్‌లకు బదులుగా గోధుమ రవ్వతో చేసిన పెసలతో చేసిన పొంగల్, పెసరట్టు, రాగి, క్యారట్ ఇడ్లీ లాంటివి ఇవ్వాలి కేక్‌ల తయారీలో డ్రై ఫ్రూట్స్, పళ్ల ముక్కలు ఎక్కువగా వాడాలి బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఉడకబెట్టిన సెనగలు, మొలకలు అందుబాటులో ఉంచాలి ఫ్రిజ్ ట్రేలలో చాక్లెట్లు, బిస్కెట్లకు బదులుగా పళ్లు, సలాడ్లు, పాలు, గుడ్లు ఉంచాలి. ఎక్కువగా ఆటలాడుతూ ఉంటారు కాబట్టి రోజుకి కనీసం గుప్పెడు డ్రై ఫ్రూట్స్ తినేలా చూసుకోవాలి. ఉదయం, సాయంత్రం కలిపి కనీసం అర లీటరు పాలు తాగేలా చూసుకోవాలి ఉడికించిన సెనగలు, బొబ్బర్లు ఎక్కువ సమయంపాటు శక్తినిస్తాయి. కాబట్టి బాస్కెట్‌బాల్, క్రికెట్‌లాంటి ఆటల్లో పాల్గొనే పిల్లలకు వీటిని శ్నాక్స్‌గా ఇస్తూ ఉండాలి. టీనేజ్‌లో... కొంతమంది టీనేజర్లు...మరీ ముఖ్యంగా అమ్మాయిలు బరువు పెరిగిపోతామనే బెంగతో తగినంత ఆహారం తీసుకోకుండా పోషక లో?లకు గురవుతూ ఉంటారు. ఇలాంటి టీనేజర్లను కనిపెట్టి తల్లులు పౌష్టికాహారం వల్ల భవిష్యత్తులో ఒరిగే ప్రయోజనాల గురించి వారికి అవగాహన కల్పించాలి చిన్న వయసు నుంచే శరీరానికి పోషకాలు అందిస్తూ గర్భం దాల్చే సమయానికి శరీరాన్ని ఎలా సన్నద్ధం చేయాలో, అలా చేయకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయో వివరించాలి ఉదయం అల్పాహారం స్కిప్ చేయకుండా చూసుకోవాలి తగినంత క్యాల్షియం, పోటీన్ తీసుకుంటూ వ్యాయామం చేస్తే ఎత్తు పెరగటంతో?టు, చక్కటి శరీర సౌష్టవం కూడా సొంతమవుతుంది.

### 45 ఏళ్ల నుంచి వృద్ధాప్యం వరకూ...

ఈ వయసు స్త్రీలలో హార్మోన్ల స్రావాలు తగ్గిపోతాయి కాబట్టి శరీరం కాల్షియంను శోషించుకునే శక్తి కోల్పోతుంది. ఫలితంగా ఎముకలు, కీళ్ల నొప్పులు మొదలవుతాయి. పురుషుల్లో కండరాలు పటుత్వం కోల్పోతాయి కాబట్టి క్యాల్షియంను సప్లిమెంట్ల రూపంలో తీసుకోవటం అవసరం. దీంతోపాటు మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాల సప్లిమెంట్లను వైద్యుల సూచనమేరకు వాడాలి˘ఈ వయస్కుల్లో కంటి చూపు, జ్ఞాపకశక్తి తగ్గిపోతూ ఉంటుంది. బీటా కెరోటిన్, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే కాలిఫ్లవర్, క్యారెట్, చిలకడ దుంపలు, గుమ్మడికాయ మొదలైనవి తీసుకోవాలి˘వాల్‌నట్స్, బాదం కూడా ఎక్కువగా తినాలి.

## వెళ్లొద్దామా భూటాన్.. తక్కువ ధరలోనే ఐఆర్సీటీసీ ప్యాకేజీ..



సమ్మర్లో టూర్ వెళ్దామని వెళ్లలేకపోయారా? దగ్గరలోని ఏదైనా టూరిస్ట్ స్పాట్ కి.. అవకాశం ఉంటే వేరే దేశానికి వెళ్లాలని ఆలోచన చేస్తున్నారా? అయితే మీకో గుడ్ న్యూస్. మన పొరుగు దేశమైన భూటాన్ ను సందర్శించడానికి భారతీయ రైల్వేకు చెందిన ఐఆర్సీటీసీ కొత్త ప్యాకేజ్ ను తీసుకొచ్చింది. సాధారణంగా జూన్ లో స్కూళ్లు, కళాశాలలు రీ ఓపెన్ అవడం.. జూలైలో వర్షాలు బాగా కురుస్తాయి కాబట్టి ఎక్కడైనా టూర్ వెళ్లాలన్నా కాస్త ఇబ్బంది. అందుకే ఆగస్టులో అయితే కాస్త తీరిక దొరకుతుంది. సరిగ్గా ఆ నెలలోనే ఐఆర్సీటీసీ భూటాన్ టూర్ ప్యాకేజీని అందిస్తోంది. తక్కువ బడ్జెట్లో విదేశాలకు వెళ్లాలను ప్లాన్ చేసుకునే వారికి ఇది సరైన డెస్టినేషన్. స్నేహితులతో వెళ్లాలన్నా, కుటుంబాలతో, పిల్లలను తీసుకొని వెళ్లాలన్నా.. హనీమూన్ ట్రిప్ వేయాలన్నా ఇదే సరైన వేదిక. ఇక్కడ మీకు చూడటానికి చాలా ప్రదేశాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఐఆర్సీటీసీ భూటాన్ టూర్ కి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడూ చూద్దాం..

### ది ల్యాండ్ ఆఫ్ ది థండర్ డ్రాగన్..

మీరు ఆగస్టు నెలలో భూటాన్‌కు ట్రిప్ ప్లాన్ చేస్తున్నట్లయితే, మీరు ఐఆర్సీటీసీ ప్యాకేజీని తీసుకోవచ్చు. వాస్తవానికి, ఆగస్టు నెలలో, ఐఆర్సీటీసీ 7 రాత్రులు, 8 పగళ్లు ప్రత్యేక ప్యాకేజీతో వచ్చింది. దీనిలో మీరు భూటాన్‌లోని 3 అందమైన ప్రదేశాలను సందర్శించవచ్చు. ఐఆర్సీటీసీ ఈ ప్యాకేజీకి ది ల్యాండ్ ఆఫ్ ది థండర్ డ్రాగన్ అని పేరు పెట్టింది. భూటాన్ విత్ కామాఖ్య టెంపుల్ ఎక్స్ చెన్నై ప్యాకేజీ పేరుతో ఈ టూర్ ఆగస్టు 15న చెన్నైలో ప్రారంభమవుతుంది.

### ఈ ప్యాకేజీలో ఇవి ఉంటాయి..

ఈ ప్యాకేజీలో మీరు పారో, పునాఖాతో పాటు భూటాన్ రాజధాని థింపూని సందర్శిస్తారు. ట్రావెలింగ్ మోడ్ విషయానికి వస్తే మీరు విమానంలో భూటాన్ చేరుకుంటారు. మీరు ఇండిగో ఎయిర్‌లైన్స్, డ్రక్ ఎయిర్ విమానాల ద్వారా చెన్నై నుంచి గౌహతి మీదుగా పారోకి ప్రయాణిస్తారు. విమాన టికెట్ ఎకానమీ క్లాస్‌గా ఉంటుంది. ఈ ప్యాకేజీలో మీరు త్రీ స్టార్ హోటల్‌లో బస చేసే అవకాశం ఉంటుంది. ఇందులో మీరు పారోలో 3 రాత్రులు, థింపులో 2 రాత్రులు, పునాఖా, గౌహతిలో ఒక్కొక్క రాత్రి గడుపుతారు. మూడు భోజనాలు ఈ ప్యాకేజీలో ఉంటాయి. ఇందులో 7 బ్రేక్‌ఫాస్ట్‌లు, 7 లంచ్‌లు, 7 డిన్నర్లు ఉంటాయి.

### ఏం చూస్తామంటే..

ఈ ప్యాకేజీలో, మీరు సైట్‌ను వీక్షించడానికి రోలర్ కోస్టర్/కోస్టర్‌పై వెళ్తారు. సైట్ సీన్‌లో ప్రవేశ టికెట్ కూడా ఉంటుంది. ప్యాకేజీలో మీరు థింపు, పారో, పునాఖాలోని అనేక ప్రదేశాలను చూడగలుగుతారు. అలాగే, తిరిగి వచ్చినప్పుడు గౌహతిలోని కామాఖ్య ఆలయాన్ని కూడా సందర్శిస్తారు. ఈ ప్యాకేజీలో ఇంగ్లీష్ మాట్లాడే టూర్ గైడ్ కూడా ఉంటుంది. ఇది కాకుండా, టూర్ మేనేజర్ సర్వీస్, భూటాన్ కోసం అనుమతి, భూటాన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఫీజు, టీసీఎస్, జీఎస్టీ వంటివి ప్యాకేజీలోనే కవర్ అవుతాయి.

### ప్యాకేజీ ధర..

షేరింగ్ ప్రాతిపదికన ముగ్గురు వ్యక్తులు ఈ ప్యాకేజీని బుక్ చేసుకుంటే, ప్యాకేజీ ధర ఒక్కో ప్రయాణికుడికి రూ.87,800. అదేవిధంగా ఇద్దరు వ్యక్తుల ప్యాకేజీ ధర ఒక్కో ప్రయాణికుడికి రూ.92,000. ఎవరైనా ఈ ప్యాకేజీని ఒకే వ్యక్తికి మాత్రమే బుక్ చేస్తే, అతను రూ. 1,06,500 చెల్లించాలి. పిల్లలకు ఈ ప్యాకేజీ ధర రూ.74,500 నుంచి రూ.68,900. మీరు ఐఆర్సీటీసీ వెబ్‌సైట్‌ను సందర్శించడం ద్వారా ఆన్‌లైన్‌లో ఈ ప్యాకేజీని బుక్ చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్‌లో మీరు ఐఆర్సీసీటీసీ కార్యాలయానికి వెళ్లవలసి ఉంటుంది.

## చల్లని బీర్ తాగితే .. చక్కని ఆరోగ్యం..అధ్యయనాలు ఏం చెబుతున్నాయో తెలుసా..



మనలో చాలా మంది బీరు తాగడం గురించి భిన్నాభిప్రాయాలను కలిగి ఉంటారు.కొందరు బీరు తాగే వ్యక్తులపై ఏకంగా తాగుబోతులనే ముద్ర వేస్తూ ఉంటారు.అయితే బీరు తాగడం వల్ల మన శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.ఎక్కువ మోతాదులో బీరు తీసుకోవడం వల్ల శరీరానికి నష్టమే అయినప్పటికీ తగిన మోతాదులో బీరును తీసుకుంటే శరీరానికి చాలా మంచిదని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

వాతావరణం హాట్ హాట్‌గా ఉన్నప్పుడు ఒక చల్లని బీర్ కొడితే ఎలా ఉంటుంది? ఆ మజాయే వేరు కదా! అవును, మరి. మజాగానే ఉంటుంది. అయితే దాని టేస్ట్ తెలిసిన వారికే ఆ మజా అందుతుంది. లేదంటే అందదు. అంటే డ్రింకింగ్ అలవాటు ఉన్నవారైతేనే బీర్ టేస్ట్‌ను ఎంజాయ్ చేయగలుగుతారని అర్థం. కానీ మోతాదుకు మించి తాగితే బీర్‌తోనూ అనర్థాలు తప్పవు, బీర్ తాగడం అనేది ఇప్పుడు చాలా మాములు విషయం అయిపోయింది, ఒకప్పుడు మందు తాగాలంటే అది చాలా పెద్ద తప్పుగా భావించేవారు, కాని ఇప్పుడు ఫ్రెండ్స్ కలిసిన, క్రికెట్ మ్యాచ్ ఉన్న, పండగలకి చుట్టాలు వచ్చిన, వీకెండ్ అయిన ఖచ్చితంగా బీరు పొంగాల్సిందే అన్నట్టుగా మారిపోయింది కాలం. ఫ్రెండుకు జాబొచ్చినా.. గర్ల్ ఫ్రెండ్ హ్యాండిచ్చినా.. ఇంటికి సుట్టమొచ్చినా.. రాకరాక వానొచ్చినా.. మస్తు..ఖుషీగా ఓపెన్ చేసేది బీర్ బాటిలే. అవును.. బాధైనా, సంతోషమైనా, వేడుకైనా, వేదనైనా బీర్తో షేర్ చేసుకోవడం మనోళ్లకు బాగా అలవాటైపోయింది. అయితే.. బీర్ తాగితే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయంటున్నాయి కొన్ని స్టడీలు. బావొచ్చినా, బంధువొచ్చినా ఆఖరికి బాధొచ్చినా బీర్ తో వెల్ కమ్ చెప్తారు. చాలామంది. ఇంటికొచ్చిన చుట్టానికి బీర్ తో మర్యాద చేయకపోతే అదొక నామోషీ అని ఫీలవుతుంటారు. మద్యపానం ఆరోగ్యానికి హానికరం .. థియేటర్లో సినిమా స్టార్టవడానికి ముందు ఈ యాడ్, ముఖేష్ యాడ్ ఉండాల్సిందే. కానీ.. మనోళ్లు అవన్నీ పట్టించుకుంటరా? ఇంటర్వెల్ కాంగనే... బయటికి పోయి ఓ దమ్ము గుంజి వస్తారు.. సినిమా అయిపోయి ఇంటికి వెళ్లేటప్పుడు మధ్యలో వైన్? షాపునకు వెళ్లి చల్లటి బీరు తాగి .. ఇంటికి వెళ్లిన తరువాత తల్లో.. పెళ్లామో అరుస్తారని అంతో.. ఇంతో తిని గుర్రుపెడుతారు.

బీర్? తాగితే పొట్ట రాదు..

బీర్ ప్రేమికులందరికీ ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ ఓ వార్త మోసుకొచ్చింది. బీరు తాగితే ఆరోగ్యానికి ఎన్నో లాభాలున్నాయని పరిశోధకులు తెలిపారు. ఈ విషయం ఆ యూనివర్సిటీ చేసిన అధ్యయనంలో తేలిందట. బీర్ తాగితే.. పొట్ట పెరుగుతుందని చాలామంది అనుకుంటారు. అందుకే.. చాలాసార్లు బీర్ తాగాలని ఉన్నా.. పొట్ట వస్తుందేమో అని భయపడి ఇంకో మార్గం చూసుకుంటారు. అయితే.. బీర్ తాగితే పొట్ట రాదని ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ చేసిన పరిశోధనల్లో వెల్లడైందని సైంటిస్టులు తెలిపారు. బీరులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఆ యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలతో పోరాడుతాయట. శరీరంలో క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసే ఎంజైములతో బీర్ లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫైట్ చేసి వాటిని నాశనం చేస్తాయట. ఒరెగాన్ యూనివర్సిటీకి చెందిన సైంటిస్టులు చేసిన స్టడీలో ఈ విషయం తేలింది.

మెరుగైన కంటి చూపు కోసం బీర్ ?తాగితే....

గట్టిగా రెండు బీర్లు తాగితే... కళ్లు తిరుగుతాయి. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతుంది అని స్కూల్లో చదువుకున్న సోషల్ లెసన్ కళ్లముందు ప్రత్యక్షంగా కనిపిస్తుంది. ఈ ముచ్చట పక్కకు పెడితే.. బీరు తాగడం వల్ల వయసు మీద పడిన తర్వాత వచ్చే దృష్టిలోపం సమస్య రాదట. కెనడాలో చేసిన స్టడీలో ఈ విషయం బయటపడింది. ప్రతిరోజూ ఓ గ్లాస్ బీర్ తాగితే.. కంటిచూపు మెరుగవుతుందట. శరీరంలో యాంటీ ఆక్సిడెంట్లు యాక్టివ్ గా పనిచేస్తాయట. అంతేకాదు బీర్ తాగినప్పుడు ఒత్తిడంతా పోతుందట. ఆ సమయంలో బ్లడ్ ప్రెషర్ కూడా అదుపులోకి వస్తుందట. ఇది ఎవరో చెప్పిన ముచ్చట కాదు.. హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు హైబీపీతో బాధపడుతున్న కొంతమందికి బీర్? తాగించి వారు చేసిన అధ్యయనంలో తేలింది.

బీర్ తాగితే గుండెపోటు రాదంట....

మనిషి పదికాలాల పాటు చల్లగా,ఆరోగ్యంగా ఉండాలంటే గుండె బాగుండాలి. దాని పనితీరులో ఏమాత్రం తేడా వచ్చినా... అంతే సంగతులు. బ్రిటీష్ మెడికల్ జర్నల్ పబ్లిష్ చేసిన ఓ ఆర్టికల్‌లో బీర్ తాగడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం 24.7 శాతం తగ్గుతుందని తేల్చారు. ఇందుకు కారణం ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు మేలు చేయడమేనట. లండన్ యూనివర్సిటీ వాళ్లు చేసిన అధ్యయనంలో ... బీర్ తాగడం వల్ల బెల్లీ ఫ్యాట్ వస్తుందనేది అబద్ధం అని తేలింది. కొవ్వు పెరగడం, పొట్ట రావడం సంగతి అటుంచితే... ఇందులోని ఫ్లేవనాయిడ్లు బరువు తగ్గించడానికి తోడ్పడుతాయట.

బీర్ తాగితే కిడ్నీలో రాళ్లు మాయం

శరీరానికి ఎంత ఫైబర్ అందితే.. బాడీఅంత దృఢంగా అవుతుంది. జీవక్రియలు అంత సక్రమంగా జరుగుతాయి. ఈవిషయం ఏ డాక్టరును అడిగినా చెప్తారు. అందుకే.. ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉన్నఆహారం తీసుకొమ్మని సలహా ఇస్తుంటారు.అయితే.. బీర్లో ఫైబర్ పుష్కలంగా దొరుకుతుంది. శరీరానికి కావాల్సిన ఫైబర్ కంటెంట్ బీర్లో 20శాతం ఉంటుంది. ఇక కిడ్నీల్లో రాళ్లతో బాధపడేవారికి డాక్టర్లు వీలైనంత ఎక్కువ నీళ్లు తాగమని చెప్తారు. దొరికితే కలుషితం కాని స్వచ్ఛమైన కల్లు తాగమని చెప్తారు. కల్లు దొరికితే ఓకే. కానీ... పట్నంలో నాణ్యమైన కల్లు దొరకదు కాబట్టి కిడ్నీల్లో రాళ్లతో బాధపడే వారికి అప్పుడప్పుడు

బీరు తాగమని సలహా ఇస్తారు.ఎందుకంటే బీర్లో రాళ్లు కరిగించే గుణాలున్నాయి. పొటాషియం, మెగ్నీషియం బీరులో పుష్కలంగాఉండి, కిడ్నీలో రాళ్లు కరిగించడానికిసహాయపడతాయి.

బీర్ లో బీ విటమిన్?..

ఆరోగ్యంగా ఉండండి..రన్ అవుట్ కాకండి’ అంటూ సిగరెట్ యాడ్లో రాహుల్ ద్రావిడ్ చెప్పేమాటలు గుర్తున్నాయా.... బీ-విటమిన్ తక్కువై ఆరోగ్యం విషయంలో కూడా రన్ అవుట్ కావొద్దంటే రోజుకో గ్లాసుబీర్ తాగమని చెప్తున్నారు పరిశోధకులు. బీర్? లో బి-విటమిన్? కంటెంట్? పుష్కలంగాఉంటుంది. కణాల ఆరోగ్యాన్ని బి-విటమిన్లు పెంచుతాయి. ఆరోగ్యానికి మాత్రమే కాదు..అందానికి కూడా బీర్ చాలా ఉపయోగపడుతుంది. వెంట్రుకల ఆరోగ్యం కోసం, పటుత్వం కోసం రకరకాల షాంపూలు, నూనెలు, ప్యాక్లు వాడి అలసిపోయారా? అయితే.. ఈ సారి బీర్ తో మీ జుట్టు కడిగిచూడండి. తేడామీరే గమనిస్తారు. అల్రెడీ మార్కెట్లో బీర్ షాంపూలు దొరుకుతున్నాయి కదా...

డయాబెటిస్...

బీర్లలో ఉండే ఆల్కహాల్ ఇన్సులిన్ సెన్సిటీవిటీని అధికం చేస్తుందట. దీని వల్ల డయాబెటిస్ వచ్చే అవకాశాలు తగ్గుతాయట. 2011లో హార్వర్డ్? యూనివర్సిటీ పరిశోధకులు చేసిన ఓ రీసెర్చి ప్రకారం తరచూ తగిన మోతాదులో బీర్లను తాగుతున్న వారిలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు 25 శాతం వరకు తగ్గుముఖం పట్టాయట. బీర్లలో ఉండే సాల్యుబుల్ ఫైబర్ డయాబెటిస్ ఉన్నవారికి మేలు చేస్తుందట.ఏదైనా సరే మోతాదుగా తీసుకుంటే ఎటువంటి అనర్ధాలు ఉండవు, మోతాదు మించితేనే అనారోగ్యం పాలు కావాల్సివస్తుంది, కాని బీరుని మితంగా తీసుకుంటే చాలా ఉపయోగాలు ఉన్నాయని పరిశోధనలో తేలింది, ఆరోగ్యంగా ఉన్న మగ లేదా ఆడ మనిషి రోజుకు 12 ఔన్సుల (దాదాపు 350 ఎంఎల్) మోతాదులో బీర్ తాగితే దాంతో ఎన్నో ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయట. ఎన్ని బెనిఫిట్స్ ఉన్న తక్కువ మోతాదులో తాగితేనే అవన్నీ మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి, అదే పనిగా ఎక్కువ మోతాదులో బీర్లు తాగితే హార్ట్ సమస్యలతో పాటు, కిడ్నీ సమస్యలు వచ్చే ఆవకాశం ఉందని వైద్య నిపుణులు చెప్తున్నారు, సూపర్ స్టార్ రజినికాంత్ చెప్పిన్నట్టుగా భోజనం అయిన.. బీరు అయిన మితంగా తీసుకుంటేనే ఔషదం.... అమితంగా తీసుకుంటే విషం అని గుర్తుపెట్టుకోండి.

## కమ్యూనిస్టులకు-కౌగిలింతలు' అక్కర లేదు : బృందాకారత్




త్రిస్సూర్ : కమ్యూనిస్టులకు -కౌగిలింతలు' అక్కరలేదని, స్వచ్ఛమైన రాజకీయాలు కావాలని సిపిఐ(ఎం) నేత బృందాకారత్ పేర్కొన్నారు. కేరళం మాజీ ముఖ్యమంత్రి, సిపిఐ(ఎం)సీనియర్ నేత పినరయి విజయన్ ను ఉద్దేశించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. శనివారం ఆమె జాతీయ మీడియాతో మాట్లాడారు. తమకు ఎవరి నుండి ఎటువంటి కౌగిలింతలు అవసరం లేదని, కమ్యూనిస్టులు కౌగిలింతలను కోరుకోరని అన్నారు. తాము నిబద్ధత కలిగిన రాజకీయాలను కోరుకుంటామని అన్నారు. ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేసేందుకు బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు రాజకీయాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నాయని మండిపడ్డారు. కానీ రాహుల్ గాంధీ కేరళంకు వచ్చి, రాజకీయం పేరిట అత్యంత గౌరవనీయులైన నేత పినరయి విజయన్ పై దాడి చేస్తారని, తిరిగి బిజెపి-ఆర్ ఎస్ ఎస్ కు వ్యతిరేకంగా అన్నీ పార్టీలు ఐక్యం కావాలని కోరుకుంటారని అన్నారు. ఇది పూర్తిగా ద్వంద్వ ప్రమాణమని మండిపడ్డారు. "రాహుల్ గాంధీజీ .. మీ కౌగిలింతలు మీ దగ్గరే ఉంచుకోండి. కానీ ప్రతిపక్ష నాయకుడిగా, బిజెపి -ఆర్ఎస్ఎస్‌లకు వ్యతిరేకంగా తమ జీవితంలో అధిక భాగం కార్మిక వర్గం కోసం పోరాడిన పినరయి విజయన్ వంటి ప్రతిపక్ష నేతలను గౌరవించండి" అని రాహుల్ గాంధీకి హితవు పలికారు.౦

## కృష్ణమ్మకు జలకళ - ప్రకాశం బ్యారేజి గేట్లు ఎత్తివేత



విజయవాడ : నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. వీటి ప్రభావంతో ఎపి, కర్నాటక, తమిళనాడు, కేరళల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఎపి లో నేడు పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడటానికి అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. నేడు కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. దక్షిణ కోస్తా తీర ప్రాంతం, రాయలసీమ జిల్లాలపై రుతుపవనాల ప్రభావం కొనసాగుతోంది. పలు చోట్ల ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షం పడుతోంది. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల కృష్ణా నది జలకళను సంతరించుకుంది. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఈ ఉదయం గేట్లను ఎత్తివేశారు అధికారులు. సుమారు 2,000 నుంచి 3,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా నది దిగువ భాగానికి నీరు వదలడం ఇదే మొదటిసారి. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో స్థానిక పరివాహక ప్రాంతాల నుంచి బ్యారేజీకి వచ్చే నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. దీంతో అదనపు నీటిని పరిమితంగా విడుదల చేసేలా నిర్ణయం తీసుకున్నారు. కృష్ణా సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్య నాలుగు గేట్లు ఎత్తారు. ఆ సమయంలో దిగువకు సుమారు 2,000 నుంచి 3,000 క్యూసెక్కుల మధ్య నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. వాస్తవంగా విడుదలైన నీటి పరిమాణం సుమారు 2,900 క్యూసెక్కులుగా నమోదైంది. స్థానిక క్యాచ్‌మెంట్ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మిగులు నీటిని వదిలినట్లు వివరించారు. ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో కృష్ణా నది ఒడ్డున ఉన్న ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులకు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి విడుదల తక్కువ పరిమాణంలోనే ఉన్నప్పటికీ, ప్రవాహం పెరిగే పరిస్థితులు ఉంటే ముందస్తు జాగ్రత్తలు అవసరమని అధికారులు పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి విడుదల దృశ్యాలను చూసేందుకు వచ్చిన సందర్శకులు బ్యారేజీ పరిసరాల్లో నిలిచారు. కాగా.. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నేడు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎపి విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని అన్నారు. ప్రత్యేకించి శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని అన్నారు.

## మమతా బెనర్జీకి రెబల్ ఎంపి కుమారుడు నోటీసులు





కోల్ కతా : రెబల్ టిఎంసి ఎంపి కకోలీ ఘోష్ కుమారుడు వైద్యనాథ్ ఘోష్ దస్తీదార్ పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు టిఎంసి నేతలకు లీగల్ నోటీసులు పంపారు. బరాసత్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి పార్టీ టికెట్ ఆశించారన్న ఆరోపణలను ఖండిస్తూ మమతా బెనర్జీ సహా మహువా మొయిత్రా, కళ్యాణ్ బెనర్జీ, సౌగతా రాయ్, నాలి గుహ వంటి పలువురు నేతలకు నోటీసులు పంపినట్లు సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. 15 రోజుల్లోగా బహిరంగ వివరణ, క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో కోరారు. తాను బరసత్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎలాంటి నామినేషన్ కోరలేదని, ఆశించలేదని, తనకు ఎటువంటి రాజకీయ ఆశయం లేదని ఆయన స్పష్టం చేశారు.ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన టిఎంసిలో అంతర్గత విబేధాలు పెచ్చుమీరిన సంగతి తెలిసిందే. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి పార్టీ వ్యవహారాలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఎంపిలు, ప్రజా ప్రతినిధులు బహిరంగంగా తిరుగుబాటు ప్రకటిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. తన కోసం ఎమ్మెల్యే టికెట్ కోరుతూ తన తల్లి కకోలీ ఘోష్ ఏడ్చారని మహువా మొయిత్రా తప్పుడు ప్రచారం చేశారని" వైద్యనాథ్ ఘోష్ ఎక్స్ లో ఆరోపించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. "నా కోసం ఎమ్మెల్యే టికెట్ కోరుతూ మా అమ్మ ఏడ్చారని మహువా మొయిత్రా అబద్ధం చెప్పారు. ఇది వంద శాతం అబద్ధం. విభేదాలను రాజకీయంగా పరిష్కరించుకోవాలి తప్ప, వ్యక్తిగత వ్యక్తులను లేదా కుటుంబ సభ్యులను వివాదంలోకి లాగకూడదు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కును నేను కలిగి ఉన్నాను," అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. తాను గానీ, తన తల్లి గానీ బసరత్ అసెంబ్లీ టికెట్ కోరలేదని, ఆ ఆరోపణలను తాను ఖండిస్తున్నానని అన్నారు. తన తల్లి మద్యం సేవిస్తున్నారన్న ఆరోపణలను కూడా ఖండిస్తున్నానని మరో పోస్ట్ లో తెలిపారు. మీడియా ఇంటర్వ్యూలు, బహిరంగ ప్రకటనలతో సహా వివిధ సందర్భాలలో, అతను బరసత్ నుండి రాజకీయ నామినేషన్ కోరాడని సూచిస్తూ అనుమానాలు వ్యక్తం చేశారని, అతని తల్లి అసమ్మతి రాజకీయ వైఖరిని అవలంబించడానికి దారితీసిందని కూడా ఆరోపించారు. "నా క్లయింట్ ఈ ఆరోపణలను ఖచ్చితంగా ఖండిస్తున్నారు. అతను బరసత్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎటువంటి నామినేషన్ కోరలేదని లేదా కోరుకోలేదని, ఆ విషయంలో అతనికి ఎటువంటి రాజకీయ ఆశయం లేదని ఆయన పేర్కొంటున్నారు," అని ఆ నోటీసులో ఉంది. బరసత్ అసెంబ్లీ సెగ్మెంట్ నుండి ఎన్నికలలో పోటీ చేయమని ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐ-ప్యాక్)కి చెందిన ప్రతినిధులు పలుమార్లు తనను సంప్రదించారని కూడా ఆ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. టీఎంసీపీ కార్యకర్త సోహోం పాల్ పలుమార్లు వాట్సాప్ ద్వారా దస్తిదార్‌ను సంప్రదించి, ఎన్నికల్లో పోటీ చేయమని ప్రోత్సహించారని, అలాగే బరసత్‌లో జరిగే ఆరోగ్య శిబిరాలకు హాజరు కావాలని ఆహ్వానించారని కూడా అందులో ప్రస్తావించారు. బరసత్ సీటును తనకు కేటాయించాలని కోరినట్లు టిఎంసి నేతలు చేసిన వాదన "అసత్యం , పరువు నష్టం కలిగించేది" అని పేర్కొంటూ, 15 రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని వైద్యనాథ్ డిమాండ్ చేశారు.

# మనకు ఎల్ ని'నో'!

- హిందూ మహా సముద్రంలో అరుదైన వాతావరణ పరిస్థితి
- దేశంలో ఎల్ నినో ప్రభావాన్ని అడ్డుకునే అవకాశం
- 'ఇండియన్ నినో'గా పిలుస్తున్న శాస్త్రవేత్తలు
- రుతుపవన గాలుల్ని మనవైపు బలంగా నెట్టే చాన్స్
- సాధారణ వర్షాలు కురుస్తాయనే అంచనాలు





స్పెషల్ డెస్క్ : పసిఫిక్ మహాసముద్రంలో తీవ్రమైన 'సూపర్ ఎల్ నినో'పరిస్థితులు ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. దీనివల్ల సాధారణంగా భారతదేశంలో నైరుతి రుతుపవనా లు బలహీనపడి, వర్షాలు తగ్గిపోయి తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉంది. కానీ ప్రస్తుతం ఆ ముప్పు తప్పే అవకాశం ఏర్పడింది. హిందూ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఒక అరుదైన వాతావరణ పరిస్థితి మనల్ని కాపాడనున్నట్టు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఆ పరిస్థితినే శాస్త్రవేత్తలు 'పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్' (పాజిటివ్ ఐఓడీ) లేదా 'ఇండియన్ నినో'అని పిలుస్తున్నారు.

ఏమిటీ పాజిటివ్ ఐఓడీ?: హిందూ మహాసముద్రం తూర్పు, పశ్చిమ భాగాల మధ్య ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పునే 'ఐఓడీ'అంటారు. ఈ పరిస్థితులో పశ్చిమ భాగం (భారత్/ఆఫ్రికా వైపు) సముద్రపు నీరు సాధారణం కంటే బాగా వేడెక్కుతుంది. దీనివల్ల భారీగా తేమతో కూడిన మేఘాలు ఏర్పడతాయి. తూర్పు భాగం (ఇండోనేసియా వైపు)లో నీరు సాధారణం కంటే చల్లబడుతుంది. పసిఫిక్‌లోని ఎల్ నినో మన దేశానికి వచ్చే రుతుపవన గాలులను వెనక్కి లాగేస్తుంటే.. హిందూ మహాసముద్రంలోని 'ఇండియన్ నినో'ఆ గాలులను అంతే బలంగా మన దేశం వైపు నెడుతుంది. ఫలితంగా ఎల్ నినో తెచ్చే పొడి గాలులు తటస్థంగా మారి, దేశంలో సాధారణ వర్షాలు కురుస్తాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

1997 నాటి వాతావరణ అద్భుతం!: ఇలాంటి పరిస్థితి 1997లోనూ చోటు చేసుకుంది. ఆ ఏడాది.. శతాబ్దంలోనే అత్యంత బలమైన ఎల్ నినో రావడంతో భారత్‌లో తీవ్ర కరువు ఖాయమనే అంచనాలు వెలువడ్డాయి. కానీ సరిగ్గా అదే సమయంలో హిందూ మహాసముద్రంలో ఏర్పడిన బలమైన 'పాజిటివ్ ఐఓడీ'... ఎల్ నినో ప్రభావాన్ని పూర్తిగా తిప్పికొట్టింది. ఆ ఏడాది కరువు రాకపోగా.. దేశంలో సాధారణం కంటే 2 శాతం ఎక్కువే వర్షాలు కురిశాయి. వాస్తవానికి ఎల్ నినో వచ్చిన ప్రతిసారీ దేశంలో కరువు రావాలనేమీ లేదు. అయితే ఈ ఏడాది మనకు 'ఇండియన్ నినో'రక్షణగా నిలవబోతున్నదన్న అంచనాలు, భారతీయ రైతాంగానికి, సాధారణ ప్రజలకు ఇది పెద్ద ఊరట అనే చెప్పాలి.

# అన్ని లక్షల కోట్లు ఉంటేనా..!!!



ఒకటి పక్కన పన్నెండు సున్నాలు పెట్టండి... లక్ష కోట్లు అవుతుంది. జూన్ పదమూడున ఒక డాలర్ మారకం విలువ రూ. 95.1 అంటే.. లక్ష కోట్ల డాలర్లు 95,20,990,00,00,000 రూపాయలకు సమానం! కళ్లు చెదిరే అంకె ఇది. స్పేస్--ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ తొలి ఐపీఓతో... దీనికంటే రెండు రెట్ల కంటే ఎక్కువే సంపాదించాడు. ఇంత డబ్బుతో భారత్‌లో ఎన్ని గొప్ప గొప్ప పనులు చేయవచ్చునంటే...

### రహదారులు...

దేశంలోని జాతీయ రహదారుల విస్తరణకు ఉద్దేశించిన భారత్‌మాలా పరియోజనకు సుమారు పది లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. ఐపీఓ ద్వారా 2.1 ట్రిలియన్ డాలర్లు అంటే సుమారు 199 లక్షల కోట్ల రూపాయలు వచ్చాయనుకుంటే.. దేశంలో ఉన్న జాతీయ రహదారులన్నింటినీ మళ్లీ తాజాగా నిర్మించడమే కాదు.. ఏకంగా ఆరేళ్లపాటు ఏటికేడాదీ తాజాగా కొత్త రోడ్లు వేస్తూనే ఉండవచ్చు. 2025 నాటి అంచనాల ప్రకారం దేశంలో సుమారు 145,000 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు ఉన్నాయి. నాలుగు లేన్ల రహదారి కిలోమీటర్ మేర నిర్మించేందుకు దాదాపు రూ.20 కోట్లు అవుతుందని అంచనా.

### స్మార్ట్ సిటీలు...

నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా వంద స్మార్ట్ సిటీల ప్రాజెక్టు చేపట్టిన విషయం తెలిసిందే. స్పేస్--ఎక్స్ ఐపీఓ డబ్బులతో వీటిల్లో 65 నగరాలను అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఏర్పాట్లతో అభివృద్ధి చేయవచ్చు.

### ఐదు కోట్ల మందికి 'న్యాయ్'...

2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ న్యాయ్. దేశంలోని మొత్తం ఐదు కోట్ల కుటుంబాలకు నెలకు ఆరువేల రూపాయల చొప్పున నగదు సాయం అందించాలన్నది దీని ఉద్దేశం. అంటే ఒక్కో కుటుంబానికి ఏటా రూ.72 వేలు, మొత్తం రూ.3.6 లక్షల కోట్లు ప్రభుత్వం వద్ద స్పేస్--ఎక్స్ ఐపీఓకు వచ్చినంత సొమ్ము ఉంటే... ఎలాంటి అవాంతరాలు లేకుండా 48 ఏళ్లపాటు పేద కుటుంబాలకు 'న్యాయ్'అందించవచ్చు.

### వేల ఏళ్లు 'ఆయుష్మాన్'...

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదలకు ఐదు లక్షల రూపాయల వరకూ ఉచిత ఆరోగ్య బీమా కతి?పస్తోంది. ఈ పథకాన్ని స్పేస్--ఎక్స్ సొమ్ముతో ఎంత కాలం నడపవచ్చో తెలుసా? 23,000 ఏళ్లు!

### ఫుల్ సబ్సిడీతో ఈవీలు...

సౌర విద్యుత్తుతో పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ప్రస్తుతం ఒక గిగావాట్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయలు అవుతుంది. ఈ లెక్కన రూ.199 లక్షల కోట్లతో 21,750 గిగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. ఇది ప్రస్తుతం దేశ విద్యుదుత్పత్తి సామర్థ్యానికి ఇరవై రెట్లు ఎక్కువ. కోట్లాది విద్యుత్తు వాహనాలను ఫుల్ సబ్సిడీతో నడిపించవచ్చు. పెట్రోల్, డీజిళ్ల దిగుమతులు దాదాపు శూన్యం చేయవచ్చు.

### అందరికీ చింతలేని చదువు...

స్పేస్ ఎక్స్ ఐపీఓతో వచ్చిన రూ.199 లక్షల కోట్లతో మస్క్ భారత్‌లో 70 ఏళ్లపాటు అందరికీ ఉచితంగా చదువులు చెప్పవచ్చు. ఎందుకంటే.. కేంద్ర ప్రభుత్వం ఏటా విద్యకు సుమారు 2.5 లక్షల కోట్లు ఖర్చు పెడుతుంది. ప్రపంచానికి అత్యుత్తమ ఇంజనీర్లను ఇచ్చే ఐఐటీలపై ఖర్చు పెట్టాలనుకుంటే జిల్లాకు ఒకటి చొప్పున ఏకంగా 17,400 ఐఐటీలు ఏర్పాటు చేసేందుకు తగిన సొమ్ము ఐపీఓ ద్వారా మస్క్ చెంతకు చేరింది.

### రూ. 199 లక్షల కోట్లతో...

భూమి నుంచి చంద్రుడికి రెండుసార్లు 4 లేన్ హైవే నిర్మించవచ్చు.

దేశంలోని రోడ్లు (63 లక్షల కిలోమీటర్లని అంచనా) అత్యాధునిక హంగులతో కట్టేయవచ్చు.

స్వర్ణ చతుర్భుజి (ఢిల్లీ--ముంబై--చెన్నై-- కోల్‌కతా) రహదారిని ఎకాఎకిన 300 సార్లు కట్టవచ్చు.

బోయింగ్ 737లు నాలుగు వేల కంటే ఎక్కువ కొనుక్కోవచ్చు. ఎయిరిండియా, ఇండిగో, స్పైస్‌జెట్‌ల వద్ద ఉన్న వాటి కంటే ఎన్నో రెట్లు ఎక్కువ విమానాలు అన్నమాట.

ఐపీఎల్ టీమ్స్ అన్నింటినీ ఓ యాభై సార్లు కొనేయవచ్చు.

రోజుకో రూ.కోటి ఖర్చు పెడితే మొత్తం ఖాళీ అయ్యేందుకు కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది.

# పేగుబంధమే యమపాశమై!




అమ్మ..

నలుగురు సభ్యులున్న ఇంట్లో ముగ్గురికి సరిపోయే ఆహారం మాత్రమే ఉన్నప్పుడు తనకు ఆకలి లేదని చెప్పి పిల్లల కడుపు నింపే గొప్ప మనసున్న మనిషి.

నాన్న..

పిల్లల అవసరాల కోసం రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించి.. తన అవసరాలను సైతం త్యాగం చేసి పిల్లల బాగోగుల కోసమే పరితపించే మంచి నేస్తం.

మరి అలాంటి తల్లిదండ్రులకు ఇప్పుడేమైంది?

కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పిల్లలకు స్వయంగా మరణశాసనం ఎందుకు లిఖిస్తున్నారు?

పిల్లల ప్రాణాలను తీయాలనే కఠినమైన నిర్ణయం ఎలాతీసుకుంటున్నారు?

అమూల్యమైన, కల్మషం లేని కన్నప్రేమ యమపాశంగామారుతోందా?

తల్లిదండ్రులు తమ పిల్లల్ని చంపి ఆత్మహత్య చేసుకుంటున్న సంఘటనలు గత కొంతకాలంగా ఎక్కువయ్యాయి. అప్పులబాధలో, కుటుంబ కలహాలో, మానసిక ఒత్తిళ్లో.. కారణాలు ఏవైనా సరే.. చావు ఒక్కటే పరిష్కారం అనే భావన వల్లే ఇవి పెరిగిపోతున్నాయ్. పొత్తిళ్లలోని పసిబిడ్డల దగ్గర నుంచి ఇంటర్ చదువుతున్న యుక్తవయసు పిల్లలను సైతం చంపేయడమో.. చనిపోయేలా ప్రేరేపించడమో చేసి, ఆపై వారు కూడా తనువు చాలిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జరగడానికి అనేక సామాజిక, ఆర్థిక, మానసిక కారణాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని మర్డర్--సూసైడ్ లేదా ఫిలిసైడ్--సూసైడ్ అని అంటారు. గత ఏడాది కాలంలో తెలుగు రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలను విశ్లేషిస్తే ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ కలహాలు.. డిప్రెషన్ వంటి అంశాలు కీలకంగా కనిపించాయి. వ్యాపారాల్లో నష్టాలు రావడం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు లేదా జూదంలో డబ్బులు పోగొట్టుకోవడం, అధిక వడ్డీలకు అప్పులు చేసి తీర్చలేకపోవడం వంటి అంశాల వల్ల కుటుంబాలు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయి. అప్పులు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి గొడవ చేయడం, సమాజంలో తలదించుకోవాల్సి రావడం వంటి పరిస్థితులను తట్టుకోలేక ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటారు. అలాగే భార్యాభర్తల మధ్య వచ్చే విభేదాలు కూడా ఇందుకు దారితీస్తున్నాయి. గృహ హింస, వివాహేతర సంబంధాలు లేదా భాగస్వామిపై పగ తీర్చుకోవాలనే వికృత కోపం... చివరికి పిల్లల మరణ శాసనంగా మారుతోంది. చాలా కేసుల్లో తీవ్రమైన డిప్రెషన్ (కుంగుబాటు) సైతం కారణంగా ఉంటోంది.

ఎలా గుర్తించాలి.. ఏం చేయాలి?

చనిపోవాలి అనే నిర్ణయం రాత్రికి రాత్రే తీసుకోరు. ఎన్నో ఒత్తిళ్లు, సమస్యలతో విసిగి వేసారి, తీవ్రమైన నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారు. తాము చనిపోబోతున్నామనే విషయాన్ని సన్నిహితుల దగ్గర పరోక్షంగా వెల్లడిస్తుంటారు. కాస్త నిర్వేదంగా మాట్లాడుతుంటారు. మన కుటుంబ సభ్యులు, సన్నిహితుల ప్రవర్తనలో అనూహ్యమైన మార్పు కనిపిస్తే.. వెంటనే వారితో మాట్లాడాలి. ముందుగా వారి సమస్య ఏమిటో అడిగి తెలుసుకోవాలి. నీకేం కాదు.. మేమంతా ఉన్నాం అనే భరోసా కల్పించాలి. ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పుడు ఎలా బయటపడొచ్చో వివరించాలి. ఎంత మాట్లాడినా వారు అలాగే ఉంటే.. మానసిక వైద్య నిపుణుడి వద్దకు తీసుకెళ్లాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెల్ప్‌లైన్ల ద్వారా ఇలాంటి సేవలను ఉచితంగా కూడా అందిస్తున్నాయి.

వారు క్రూరులు కాదు..

ఇలాంటి సంఘటనలు చూడగానే సహజంగా మనకు కోపం వస్తుంది. కానీ పిల్లల్ని చంపుకొనే తల్లిదండ్రులు క్రూరులు కారు. మానసిక సమస్యలతో సతమతమవుతున్న వ్యక్తులుగానే వారిని పరిగణించాలి.తీవ్రమైన నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయినవారి ఆలోచనా సామర్థ్యం తగ్గిపోతుంది. అలాంటివారంతా టన్నెల్ విజన్‌లో ఉండిపోతారు. అంటే.. సమస్య వచ్చినప్పుడు చుట్టూ ఉన్న అవకాశాలు ఏవీ కనిపించకుండా, కేవలం చావు మాత్రమే ఏకైక మార్గంగా కనిపించే ఒక విచిత్రమైన మానసిక స్థితి.

అలాగే చాలా సంఘటనల్లో పిల్లలపై మితిమీరిన ప్రేమ కూడా ఇందుకు కారణం అవుతోంది. ఆర్థికంగా, మానసికంగా, సామాజికంగా ఇబ్బందులు పడుతుంటే.. వారితో కూర్చుని మాట్లాడాలి. వారు చెప్పింది వినాలి. అలాంటివారికి కౌన్సెలింగ్ ఇవ్వడానికి పలు ఉచిత హెల్ప్‌లైన్లు కూడా ఉన్నాయి. అయినా సమస్య పరిష్కారం కాకుంటే సైకాలజిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.

పోటీ ప్రపంచంలోఏమైపోతారోనని..

గతేడాది మార్చిలో కాకినాడలో జరిగిన ఒక విషాదకర సంఘటన అందరినీ నివ్వెరపరిచింది. ఓ ప్రభుత్వ రంగసంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న చంద్ర కిషోర్ అనే వ్యక్తి తన ఇద్దరు కొడుకులను (7 ఏళ్లు, 6 ఏళ్లు) చంపి తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విపరీతమైన పోటీ ప్రపంచంలో తన పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే భయం తీవ్ర నిరాశలోకి నెట్టేసిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాని సూసైడ్ నోట్‌లో పేర్కొనడం పలువురిని షాక్‌కు గురిచేసింది.

పిల్లలను చంపడం ఎందుకు?

పిల్లలను చంపి తాము చనిపోయే తల్లిదండ్రుల్లో ఒక విచిత్రమైన మానసిక రుగ్మత కనిపిస్తుంది. 'నేను లేకపోతే నా పిల్లలు రోడ్డున పడతారు. సమాజం వారిని అనాథలుగా చూస్తుంది. నాలాగే వాళ్ళు కూడా కష్టాలు పడకూడదు. అందువల్లే నా వెంట నా పిల్లలను కూడా తీసుకెళ్లిపోతాను'అనే భావన ఇందుకు కారణం. అలాగే జీవిత భాగస్వామి మీద కోపం వల్ల కూడా పిల్లలను చంపేసే సంఘటనలు చూస్తున్నాం. ఇలా చేయడం వల్ల తమ భాగస్వామి జీవితాంతం బాధలో కూరుకుపోతారనే ఆలోచనే ఇందుకు ఉసిగొల్పుతోంది. చిన్నపిల్లలనైతే.. వారికేం తెలియదు కాబట్టి సులభంగా చంపేస్తున్నారు. మరి ఇంటర్ చదివే పిల్లల్ని ఎలా ఆత్మహత్యకు ప్రేరేపిస్తున్నారనే సందేహం రావడం సహజం. ఇక్కడ వారు తీసుకున్న నిర్ణయం ఒక్కరోజో, ఒక్క రాత్రో జరగదు. తల్లి లేక తండ్రి.. వారిని కొన్ని నెలలుగా అందుకు మానసికంగా సిద్ధం చేస్తారు. ఏం చేసినా మనం కలిసే చేయాలనే భావనను నెమ్మదిగా వారి మనసులోకి చొప్పిస్తారు. దీంతో ఆ పిల్లలు వారి మాట విని ప్రాణం తీసుకుంటున్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు ఇవే..

టెలి--మానస్ (భారత ప్రభుత్వం): 14416 లేదా 1800 891 4416(24 గంటలు అందుబాటులో ఉంటుంది)

కిరణ్ హెల్ప్‌లైన్: 1800-599-0019. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఈ టెలి-కౌన్సెలింగ్‌లో తెలుగు సహా 13 భాషలలో సేవలు ఉచితంగా లభిస్తాయి.

జీవన హెల్ప్‌లైన్ టోల్-ఫ్రీ నెంబర్: 1800-425-5438 రోష్ని హెల్ప్‌లైన్ (హైదరాబాద్): 040-66202000

శివసూర్య
తెలుగు దిన పత్రిక
RNI APTEL : 2023/88704
సోమవారం - 15 - జూన్ - 2026

## 'మెటాలో ఇక భారీ తొలగింపులు ఉండకపోవచ్చు'




సోషల్ మీడియా దిగ్గజం మెటా కృత్రిమ మేధస్సు ఆధారిత సంస్థగా రూపాంతరం చెందే క్రమంలో ఉద్యోగులకు సంబంధించి కొన్ని పొరపాట్లు జరిగాయని దాని అధినేత మార్క్ జుకర్‌బర్గ్ అంగీకరించారు. అంతర్గత మెమోలో ఉద్యోగులను ఉద్దేశించి, వేగంగా మారుతున్న ఏఐ ప్రపంచంలో ఇలాంటి సవాళ్లు సహజమని జుకర్‌బర్గ్ పేర్కొన్నారు. "ఈ మార్పుల సంక్లిష్టత దృష్ట్యా మేము తప్పులు చేశాం. భవిష్యత్తులో కూడా కొన్ని తప్పిదాలు జరిగే అవకాశం ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మెటా సంస్థ తన వ్యాపార వ్యూహాన్ని పూర్తిగా ఏఐ చుట్టూ పునర్వ్యవస్థీకరిస్తోంది. ఇందుకోసం డేటా సెంటర్లు, ఏఐ మౌలిక సదుపాయాలు, సూపర్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టులపై వందల బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోంది. ఈ క్రమంలో సంస్థలో విస్తృత స్థాయి పునర్నిర్మాణం చేపట్టింది. మే నెలలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 శాతం ఉద్యోగులను తొలగించగా, మరో 7,000 మంది ఉద్యోగులను ఏఐ సంబంధిత బృందాలకు బదిలీ చేసింది. అయితే ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలను తగ్గించే ప్రయత్నంలో జుకర్‌బర్గ్ కీలక హామీ ఇచ్చారు. "ఈ ఏడాది సంస్థవ్యాప్తంగా మరోసారి భారీ స్థాయి ఉద్యోగ కోతలు ఉంటాయని మేము భావించడం లేదు" అని స్పష్టం చేశారు. ప్రపంచ పరిస్థితులు వేగంగా మారుతున్నందున అతిగా హామీలు ఇవ్వలేనప్పటికీ, సంస్థాగత స్థిరత్వాన్ని కాపాడటమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఏఐ మోడళ్ల శిక్షణ కోసం బదిలీ చేసిన ఉద్యోగులకు కొత్త అవకాశాలు కల్పించేందుకు సంస్థ కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. అవసరమైతే కొన్ని విభాగాల్లో తగ్గించిన సిబ్బందిని తిరిగి ఇతర బృందాలకు మార్చే అవకాశమూ ఉంటుందని చెప్పారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యాలను వినియోగించుకోవడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మెటాలో జరిగిన ఏఐ ఆధారిత పునర్వ్యవస్థీకరణపై కొంత అసంతృప్తి కూడా వ్యక్తమవుతోంది. కొత్తగా ఏర్పాటైన ఏఐ విభాగాల్లో పని స్వరూపం, బాధ్యతలపై కొందరు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచేందుకు జూలైలో భారీ ఏఐ హ్యాకథాన్, టీమ్ ఈవెంట్లు నిర్వహించేందుకు సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఏఐ పోటీలో ముందంజలో నిలవాలన్న లక్ష్యంతో మెటా దూసుకెళ్తున్నప్పటికీ, ఉద్యోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, సంస్థాగత మార్పులను సమతుల్యం చేయడం కంపెనీకి ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారింది.

## మా ఏఐ మాకే సొంతం..

ఏఐని నియంత్రిస్తున్న దేశాలు రూటు మారుస్తున్నాయి. ఇప్పటిదాకా చిప్‌లను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవటంపై దృష్టి పెట్టినా... ఇపుడు ఏఐ మోడల్స్‌నూ నియంత్రించే చర్యలు మొదలెట్టాయి. అమెరికా ప్రభుత్వం ఆదేశించిన మీదట... ఆంథ్రోపిక్ సంస్థ తన క్లాడ్‌లో మైథోస్--5, ఫేబుల్--5 మోడళ్లను ఇతర దేశాల్లో ఎవరూ వాడకుండా నిషేధించటం... ఒక ఆరంభం మాత్రమే. అత్యాధునిక ఏఐ మోడళ్లను స్వదేశంలో తప్ప ఇంకెక్కడా వాడకుండా చేయటం ద్వారా ఏఐపై గుత్తాధిపత్యం సాధించాలనేది అమెరికా వ్యూహం కావచ్చనేది నిపుణుల మాట. ఇలాంటి చర్యలతో ఏఐ వాడకంలో అంతరాలు తారస్థాయికి చేరుతాయి కాబట్టి భారతదేశం ఏఐ మిషన్‌ను ఆరంభించి, రూ.50వేల కోట్లు కేటాయించాలని టెక్నోక్రాట్ మోహన్‌దాస్ పాయ్ ప్రధాని మోదీని అభ్యరి?ధంచటం గమనించాల్సిన విషయం. అమెరికా నిషేధం నేపథ్యంలో అసలు ఈ మైథోస్--5, ఫేబుల్--5 ఏం చేస్తాయి? నిషేధంతో నష్టాలేంటి? అమెరికా చెబుతున్న భద్రత కారణాలు నిజమేనా?ఇవన్నీ విశ్లేషించేదే ఈ ప్రత్యేక కథనం...

అమెరికాలో మినహా విదేశాల్లో యాక్సెస్ లేకుండా నిషేధించిన మైథోస్, ఫేబుల్ మోడళ్లు అత్యాధునికమే కాదు. శక్తిమంతమైనవి కూడా. ప్రత్యేకించి మైథోస్--5 ఉపయోగించి సైబర్ సెక్యూరిటీని ఉల్లంఘించవచ్చు. ఎదురుదాడులు చేయొచ్చు. అందుకే గ్లాస్‌వింగ్ లాంటి కార్యక్రమాల ద్వారా దీని వాడకాన్ని కొన్ని సంస్థలకే అందించింది ఆంత్రోపిక్. మైథోస్‌లోని ఫీచర్లన్నీ ఉండి... కొన్ని నియంత్రణలతో అందరికీ అందించిన మోడల్ ఫేబుల్. ఒక్కమాటలో చెప్పాలంటే మైతోస్--5 రేసింగ్ కార్ అయితే... సాధారణ రోడ్లపై తిరగటానికి ఆవిష్కరించిన దాని లీగల్ వెర్షనే ఫేబుల్--5.

మైథోస్--5 ఎందుకు స్పెషల్ అంటే?

అటానమస్ కోడింగ్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, సెక్యూరిటీ అనాలిసిస్, దీర్ఘ కాలిక రీజనింగ్, శాస్త్రీయ పరిశోధనల్లో సాయం విషయంలో మైథోస్‌కు అసాధారణమైన సామర్థ్యాలున్నట్లు ఇప్పటికే వెల్లడైంది.

-ఇక ఫేబుల్ మోడళ్ల విషయానికొస్తే...


అత్యంత భారీ సాఫ్ట్‌వేర్ కోడ్ బేస్‌లను మైగ్రేట్ చేయడానికి

కొన్నేసి గంటల పాటు రెగ్యులర్‌గా అటానమస్ పనులు చేయటానికి...

అడ్వాన్స్‌డ్ కోడింగ్, ఇంజినీరింగ్ టాస్క్‌లు చేయటానికి వాడొచ్చు.

- నిషేధం వల్ల నష్టాలేంటి?

ఆంత్రోపిక్ విడుదల చేసిన అత్యంత శక్తిమంతమైన మోడళ్లను అమెరికా వెలుపల ఎవరూ యాక్సెస్ చేసుకోలేరు.




మెరుగైన కోడ్‌ను జనరేట్ చేయటం... బగ్స్‌ను కనిపెట్టడం... భారీస్థాయి సాఫ్ట్‌వేర్ మైగ్రేషన్లను ఈజీగా చేసే సామర్థ్యాన్ని డెవలపర్లు కోల్పోతారు.

సైబర్ సెక్యూరిటీలోని లోపాలను కనిపెట్టడానికి ఉపయోగపడే అత్యంత ఆధునిక టూల్స్‌ను పరిశోధకులు వాడలేరు.

అన్నిటికన్నా ప్రధానం... అమెరికా వెలుపల ఉండేవారికి అమెరికాలో ఉండేవారితో పలు అంశాల్లో పోటీపడే సామర్థ్యం తగ్గిపోతుంది. అమెరికన్ కంపెనీలకు ప్రొడక్టివిటీ అడ్వాంటేజ్ పెరిగి... విదేశాల్లోని స్టార్టప్‌ల ఇన్నోవేషన్ సామర్థ్యం స్లో అవుతుంది. అడ్వాన్స్‌డ్ సెమీ కండక్టర్ల మాదిరి ఏఐ సామర్థ్యాలపై కూడా కొన్ని దేశాల ఆధిపత్యం కొనసాగుతుంది.

భారత్‌కు ఇబ్బందులేంటి?


భారత్‌కు ఇది చాలా ప్రధానమైన అంశం. ఎందుకంటే అత్యంత ఆధునికమైన అడ్వాన్స్‌డ్ అమెరికన్ ఏఐ మోడళ్ల యాక్సెస్ మన స్టార్టప్‌లకు ఉండదు. మన సైబర్‌సెక్యూరిటీ సంస్థలు అత్యాధునిక టూల్స్‌ను కోల్పోతాయి. పైపెచ్చు నిషేధం ఎక్కువకాలం కొనసాగితే మన సాఫ్ట్‌వేర్ సంస్థల పోటీ సామర్థ్యం తగ్గొచ్చు. నిశితంగా చూస్తే ఇప్పటిదాకా ప్రభుత్వాలు ఏఐ చిప్‌లను, సెమీకండక్టర్ పరికరాలను, సూపర్ కంప్యూటర్ల హార్డ్‌వేర్‌ను మాత్రమే నియంత్రించాయి. ఇపుడు ఏఐ మోడల్‌ను సైతం అమెరికా ఓ సాఫ్ట్‌వేర్‌లా కాకుండా కీలకమైన మిలిటరీ టెక్నాలజీలా చూడటం ఆరంభించింది. ఈ కారణాల వల్లే అమెరికా మోడళ్లపై పూర్తిగా ఆధారపడకుండా భారత్‌కు సొంత ఏఐ మోడళ్లు ఉండాలని మోహన్‌దాస్ పాయ్ వంటి టెక్నోక్రాట్లు చేస్తున్న వాదనకు బలం చేకూరుతోంది. ఈ ఏఐ నియంత్రణ ముున్ముందు మరిన్ని మలుపులు తిరుగుతుందన్నది కాదనలేని నిజం.

### ఆంథ్రోపిక్ కొత్త ఏఐ మోడళ్లు వెనక్కి

వాషింగ్టన్: ట్రంప్ విధానాలతో దేశాలు మాత్రమేకాదు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు సైతం ఇబ్బందులు పడుతున్నాయి. కోట్ల రూపాయలు ఖర్చుచేసి పరిశోధన పూర్తిచేసి వినియోగదారులకు అందుబాటులోకి తెచి?చున అధునాతన కృత్రిమమేధ (ఏఐ) టూల్స్‌ను కంపెనీలు వెనక్కి(రీకాల్) చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఆ జాబితాలో ఇప్పుడు ఏఐ దిగ్గజ సంస్థ 'ఆంత్రోపిక్'చేరింది. ప్రపంచవ్యాప్తంగా ఇటీవల అందుబాటులోకి తెచి?చన క్లాడ్ ఫేబుల్5, మైథోస్5 ఏఐ మోడళ్లను వెనక్కితీసుకుంటున్నట్లు ఆంథ్రోపిక్ శనివారం ప్రకటించింది. భద్రతా కారణాలు చూపి వీటిపై అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో తప్పనిపరిస్థితుల్లో వీటిని మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆంథ్రోపిక్ ఒక ప్రకటనలో పేర్కొంది. "భద్రత లేని, క్షేమదాయకంకాని మోడళ్లపై ఆంక్షలు విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది. కానీ అత్యంత భద్రమైన మా మోడళ్లకు ఏ సాంకేతిక లోపాల మాటున అడ్డుచెబుతున్నారో ప్రభుత్వం వివరిస్తే బాగుండేది. అప్పుడే ఈ ఆంక్షల ప్రక్రియ పారదర్శకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని అంతా భావిస్తారు'అని ఆంథ్రోపిక్ తన అసహనం వ్యక్తంచేసింది.

## ఎలక్ట్రానిక్స్ రంగం రూ.14.4 లక్షల కోట్లు!

### 2030 నాటికి అంచనా
### మూడు రెట్లు పెరగనున్న ఈఎంఎస్ మార్కెట్
### విడిభాగాలు, డిజైన్, ఐపీపై దృష్టి సారించాలి
### కేపీఎంజీ ఇండియా నివేదిక అంచనా



ముంబై: ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల (ఈఎంఎస్) రంగం వచ్చే ఐదేళ్లలో భారీగా విస్తరించనుంది. 2030 నాటికి మూడు రెట్లకు పైగా పెరిగి 150 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.14.4 లక్షల కోట్లు) ఈఎంఎస్ మార్కెట్ చేరుకుంటుందని కేపీఎంజీ ఇండియా నివేదిక అంచనా వేసింది. దేశీ డిమాండ్‌కు తోడు ప్రభుత్వపరమైన ప్రోత్సాహకాలు. చైనాకు ప్రత్యామ్నాయంగా విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థల కోసం అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపిస్తుండడం (చైనా ప్లస్ వన్ విధానం) ఈ మార్కెట్ విస్తరణకు దన్నుగా నిలవనున్నట్టు తెలిపింది. 2025లో ఈఎంఎస్ మార్కెట్ పరిమాణం 40--45 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు పేర్కొంది. అయితే ఈ రంగం వృద్ధి విస్తృతంగా కాకుండా పరిమితంగా ఉండడాన్ని ఎత్తి చూపించింది. అధిక విలువను తీసుకొచ్చే డిజైన్, విడిభాగాలు, మేధో హక్కుల (ఐపీ) పరంగా దేశీ సంస్థల పాత్ర పరిమితంగానే ఉన్నట్టు తెలిపింది. అదే సమయంలో మొబైల్, అధికంగా అమ్ముడుపోయే కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల అసెంబ్లింగ్‌కే భారత కంపెనీలు ఎక్కువగా పరిమితమైనట్టు వివరించింది. దీని స్థానంలో డిజైన్, తయారీ, ఐపీ, వ్యాల్యూ చైన్‌తో కూడిన సమగ్రమైన ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా భారత్ అవతరించాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది.

### వృద్ధికి అపార అవకాశాలు..

అంతర్జాతీయ ఈఎంఎస్ మార్కెట్ 2025లో 640--650 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2030 నాటికి ట్రిలియన్ డాలర్లకు పెరగనున్నట్టు కేపీఎంజీ నివేదిక అంచనా వేసింది. అనుసంధానత, ఎలక్ట్రిఫికేషన్, ఓఈఎం అవుట్‌సోర్సింగ్ ఈ మార్కెట్ విస్తరణకు దోహదం చేయనున్నట్టు తెలిపింది. అంతర్జాతీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం కేవలం ఖర్చులను నియంత్రించుకోవడం కంటే, నమ్మకమైన ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడంపై ఎక్కువగా దృష్టి పెడుతున్నట్టు పేర్కొంది. దీంతో ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో భారత్ వాటా 5--6 శాతంగానే ఉండగా, ఇక్కడి నుంచి భారీ వృద్ధి సాధించడానికి బలమైన అవకాశాలు ఉన్నట్టు వెల్లడించింది.

### ఈ చర్యలు అవసరం..

ఎలక్ట్రానిక్స్ తయారీకి అవసరమైన కీలక విడిభాగాల కోసం భారత్ ఇప్పటికీ 80--95 శాతం మేర దిగుమతులపైనే ఆధారపడి ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. దీనివల్ల ఇక్కడి కంపెనీల లాభాల మార్జిన్లు తగ్గిపోతున్నాయని.. దీన్ని అధిగమించడం అత్యంత ముఖ్యమని ఈ నివేదిక సూచించింది. సాధారణ ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీ ద్వారా మార్కెట్ పరిమాణం పెరిగినప్పటికీ.. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం క్లిష్టమైన సాంకేతికత కలిగిన ఆటోమోటివ్, ఇండస్ట్రియల్, ఏరోస్పేస్ రంగాలపై ఎక్కువగా దృష్టి సారించాలని పేర్కొంది. ఈ రంగాల్లో అధిక విలువ సృష్టికి అవకాశాలున్నట్టు వివరించింది. ఎలక్ట్రానిక్స్ తయారీలో తక్కువ వ్యయాలతో అంతర్జాతీయంగా భారత్ పోటీపడేందుకు కేవలం సామర్థ్య ఆధారితం కాకుండా నైపుణ్య ఆధారితంగా ఎదగాల్సి ఉందని పేర్కొంది. "ఇందుకోసం ప్రభుత్వం, తయారీ సంస్థలు సమన్వయంతో పనిచేయాలి. దేశీయంగా విడి భాగాల తయారీని పెంచడంతోపాటు కారి?మకుల్లో నైపుణ్యాలను పెంచాలి. ఇంజనీరింగ్--డిజైన్‌పై పెట్టుబడులు పెట్టడం, అంతర్జాతీయ విలువ ఆధారిత వ్యవస్థతో అనుసంధానం కావడంపై దృష్టి సారించాలి"అని ఈ నివేదిక సూచించింది.

## సముద్రంపై ఏఐ సామ్రాజ్యం!
## శామ్‌సంగ్ కొత్త ప్రయోగం

ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తరిస్తున్న కొద్దీ డేటా సెంటర్ల అవసరం మరింతగా పెరుగుతోంది. అయితే భూమిపై స్థలం కొరత, భారీ విద్యుత్ అవసరాలు, శీతలీకరణ సమస్యలు టెక్ దిగ్గజాలకు సవాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణ కొరియాకు చెందిన శామ్‌సంగ్ హెవీ ఇండస్ట్రీస్ సముద్రంపై తేలియాడే ఏఐ డేటా సెంటర్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది.

### మూడు సంస్థలు కలిసి..


తేలియాడే డేటా సెంటర్ల అభివృద్ధి కోసం శామ్‌సంగ్ హెవీ ఇండస్ట్రీస్, గ్రీకు షిప్పింగ్ సంస్థ క్యాపిటల్ క్లీన్ ఎనర్జీ క్యారియర్స్, సముద్ర భద్రతా ప్రమాణాల సంస్థ లాయిడ్స్ రెజిస్టర్ కలిసి సంయుక్త అభివృద్ధి ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇటీవల గ్రీస్‌లో జరిగిన ప్రముఖ అంతర్జాతీయ షిప్పింగ్ ఎగ్జిబిషన్ 'పోసిడోనియా 2026' సందర్భంగా ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. ఇందు లో శామ్‌సంగ్ సాంకేతిక రూపకల్పన, నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, క్యాపిటల్ పెట్టుబడులు, ప్రాజెక్టు అభివృద్ధిని పర్యవేక్షిస్తుంది. లాయిడ్స్ రిజిస్టర్ భద్రతా ధ్రువీకరణలు, నియంత్రణ అంశాలను చూసుకుంటుంది.

### డేటా సెంటర్లు సముద్రంపై ఎందుకు?

భారీ ఏఐ డేటా సెంటర్లకు విస్తారమైన స్థలం, అపారమైన విద్యుత్ సరఫరా, అధిక శీతలీకరణ వ్యవస్థలు అవసరం. అమెరికా, యూరప్ వంటి ప్రాంతాల్లో భూమి లభ్యత తగ్గిపోవడం, విద్యుత్ గ్రిడ్ కనెక్షన్ల ఆలస్యం కారణంగా కొత్త డేటా సెంటర్ల నిర్మాణం కష్టమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సముద్రంలో లేదా నదులపై తేలియాడే డేటా సెంటర్లు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నాయి. సముద్రపు నీటినే నేరుగా శీతలీకరణ కోసం వినియోగించడం వల్ల విద్యుత్ వినియోగం కూడా తగ్గే అవకాశం ఉంది.

### 50 మెగావాట్ల సామర్థ్యం.. వేలాది ఏఐ సర్వర్లు

శామ్‌సంగ్ అభివృద్ధి చేస్తున్న తొలి ఫ్లోటింగ్ డేటా సెంటర్ సామర్థ్యం 50 మెగావాట్లు గా ఉంటుంది. ఇది వేల సంఖ్యలో ఏఐ సర్వర్లను నడిపించే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ కేంద్రం రెండు విధాలుగా విద్యుత్తును పొందగలదు. తీర ప్రాంతాలకు సమీపంలో ఉన్నప్పుడు సముద్ర అడుగు కేబుళ్ల ద్వారా విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానమవుతుంది. అవసరమైతే ద్రవీకృత సహజ వాయువు




ఆధారిత సాలిడ్ ఆక్సైడ్ ఫ్యూయల్ సెల్స్ ద్వారా స్వయంగా విద్యుత్తు ఉత్పత్తి చేసుకునే సౌకర్యం కూడా ఉంటుంది.

### సర్వర్లకు సముద్రం సవాలే!

అయితే సముద్రంలో ఏఐ సర్వర్లను దీర్ఘకాలం నిర్వహించడం అంత సులభం కాదు. ఓడల కదలికలు, కంపనాలు, ఉప్పునీటి ప్రభావం, తేమ వంటి అంశాలు సున్నితమైన హార్డ్‌వేర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ సవాళ్లను అధిగమించేందుకు శామ్‌సంగ్ హెవీ ఇండస్ట్రీస్, సూపర్‌మైక్రో సంస్థతో కలిసి పరిశోధనలు నిర్వహిస్తోంది. సముద్ర వాతావరణంలో సర్వర్ల పనితీరును పరీక్షించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

### షిప్పింగ్ పరిశ్రమకు కొత్త వ్యాపార అవకాశాలు

ఫ్లోటింగ్ డేటా సెంటర్లు షిప్పింగ్ పరిశ్రమకు కూడా కొత్త ఆదాయ మార్గాలను తెరవవచ్చు. ఇప్పటివరకు సరుకు రవాణాపైనే ఆధారపడిన ఓడ యజమానులు, భవిష్యత్తులో టెక్ కంపెనీలు, క్లౌడ్ సేవల సంస్థలకు డేటా సెంటర్ సామర్థ్యాన్ని దీర్ఘకాలిక లీజుకు ఇవ్వడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంది.

### మరిన్ని సముద్ర డేటా సెంటర్లు

ఈ రంగంలో శామ్‌సంగ్ ఒక్కటే కాదు. జపాన్‌కు చెందిన మిత్సుయి ఒ.ఎస్.కె. లైన్స్ , టర్కీకి చెందిన కర్పవర్‌షిప్ కలిసి 73 మెగావాట్ల తేలియాడే డేటా సెంటర్‌ను 2027 నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. చైనాలో షాంఘై సమీపంలో 24 మెగావాట్ల నీటి అడుగున డేటా సెంటర్ ఇప్పటికే పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో నాటిలస్ డేటా టెక్నాలజీస్ 6.5 మెగావాట్ల బార్జ్ ఆధారిత డేటా సెంటర్‌ను నిర్వహిస్తోంది.

## మోటోరోలా సరికొత్త '5జీ' స్మార్ట్‌ఫోన్లు!




న్యూఢిల్లీ: భారత్‌లో లీడింగ్ కృత్రిమ మేధ (ఏఐ) స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ 'మోటోరోలా' దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఫీచర్లతో రెండు 5జీ స్మార్ట్‌ఫోన్లను ప్రవేశపెట్టింది. 'మోటో జీ37', 'మోటో జీ37 పవర్' పేర్లతో వస్తున్న మోడళ్లపై పరిమిత కాల ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తూ, భారీ డిస్కౌంట్లను అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారుల బడ్జెట్‌కు తగినట్లుగా అత్యంత తక్కువ ధరకే ప్రీమియం తరహా ఫీచర్లు, అత్యుత్తమ బ్యాటరీ పర్ఫార్మెన్స్, మిలిటరీ గ్రేడ్ ల్యాబ్ సర్టిఫైడ్ రక్షణతో ఈ ఫోన్లను తీసుకొచి?చనట్లు కంపెనీ పేర్కొంది. ఈ స్మార్ట్‌ఫోన్లు ఆకర్షణీయమైన పాంటోన్ కలర్ ఆప్షన్లలో లభిస్తాయి.

### ఫీచర్లు ఇవే

మోటో జీ37, మోటో జీ37 పవర్.. ఈ రెండు ఫోన్లలోనూ 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో కూడిన భారీ 6.7 అంగుళాల డిస్‌ప్లేను అందించారు. సినిమాటిక్ ఆడియో అనుభూతిని అందించే వినూత్నమైన 'డాల్బీ అట్మోస్' స్టీరియో స్పీకర్లు ఉన్నాయి. ఫోటోగ్రఫీ కోసం గూగుల్ ఏఐ ఎడిటింగ్ టూల్స్ సపోర్ట్ చేసే '50ఎంపీ క్వాడ్ పిక్సెల్ ఏఐ కెమెరా'ను ఈ రెండు మోడళ్లలోనూ అమర్చారు. ముఖ్యంగా 'మోటో జీ37 పవర్' ఫోన్‌లో మూడు రోజుల పాటు నిరంతరాయంగా పనిచేసే భారీ 7000ఎంఏహెచ్ బ్యాటరీ, 33డబ్ల్యూ టర్బోపవర్ ఛార్జింగ్ సదుపాయం ఉన్నాయి. అలాగే ఇందులో శక్తివంతమైన మీడియాటెక్ డైమెన్సిటీ 6400 ప్రాసెసర్, 128జీబీ స్టోరేజ్, గరిష్టంగా 24జీబీ వరకు ర్యామ్ బూస్ట్ చేసుకునే ఆప్షన్ అందించారు. దీనికి రక్షణగా స్క్రీన్ పై గొరిల్లా గ్లాస్ 7ఐ, ఎంఐఎల్--ఎస్‌టీడీ--810 హెచ్ మిలిటరీ గ్రేడ్ సరి?టఫికేషన్, ఐపీ64 వాటర్--రెసిస్టెంట్ డిజైన్ ఉన్నాయి. స్మార్ట్ యూజర్ అనుభూతి కోసం గూగుల్ 'జెమిని', 'సర్కిల్ టు సెర్చ్' వంటి ఏఐ ఫీచర్లు ఇందులో ఇన్‌బిల్ట్‌గా వస్తాయి. ధరల విషయానికొస్తే: మోటో జీ37 బేసిక్ మోడల్ ప్రత్యేక పరిమిత కాల ఆఫర్ ధర రూ.13,999 గా ఉంది (దీని అసలు ధర రూ.14,999). ఇక 'మోటో జీ37 పవర్' మోడల్ 4జీబీం128జీబీ వేరియంట్ ప్రారంభ ధర రూ.15,999 గా ఉండగా , దీని టాప్ వేరియంట్ (8జీబీం128జీబీ) అసలు ధర రూ.21,999 కాగా.. రూ.2,000 బ్యాంక్ ఆఫర్‌తో రూ.19,999 కే లభిస్తుంది. వినియోగదారులు ఈ ఫోన్లను ఈ--కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్, మోటోరోలా అధికారిక వెబ్‌సైట్ తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న రిటైల్ స్టోర్ల ద్వారా కొనుగోలు చేయవచ్చు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed at RADHIKA OFFCE PRINTERS.Near D.No. 14-784, RAJ TOWERS, KAMALANAGAR, ANANTAPUR.A.P. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343. CELL:9494741301.